Follow: @ANNTELUGU

ANN తెలుగు

22-01-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 27 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## శరవేగంగా పెండింగ్ ప్రాజెక్టులు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష

ఎస్ఎల్బీసీపై ఫోకస్.. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీకి డీపీఆర్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తిచేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై సెక్రెటేరియట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో టన్నెల్‌లో చిక్కుకున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ శకలాలను పూర్తిగా తొలగించామని, ప్రస్తుతం రైలు ట్రాక్ సహాయంతో మరమ్మతులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

మిగతా 2లో


టాప్ న్యూస్



### మన శంకరవరప్రసాద్ సిన్మా చూశా

- చిరంజీవితో సీఎం రేవంత్
- కుటుంబంతో కలిసి ఆస్వాదించా...

02



### నన్ను చంపితే.. ఈ భూమ్మీద ఇరాన్ ఉండదు

- ట్రంప్ హెచ్చరిక


02



### సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- గతంలో బీఆర్ఎస్ చేసిందే ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తోంది

02



## యువ సంపన్నుల జాబితాలో భారత్ టాప్

### చైనా, యూకేను అధిగమించిన భారత్

- ఈ జాబితాలో భారత్ నుంచి 201 మంది యువ పారిశ్రామికవేత్తలు
- 'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా నిలిచిన బెంగళూరు నగరం
- జాబితాలోని 83 శాతం మంది తొలితరం వ్యాపారవేత్తలే

**మహా :** యువభారతం ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల విషయంలో భారత్ టాప్ లో దూసుకుపోతోంది. 40 ఏళ్లలోపు వయసున్న సెంటీమిలియనీర్ల (వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద) జాబితాలో చైనా, యూకే వంటి దేశాలను భారత్ దాటేసింది. అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్, హురున్ ఇండియా సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో ఇది ప్రస్ఫుటమైంది. ఈ జాబితాలో మొత్తం 505 మంది యువ వ్యాపారవేత్తలు ఉండగా, వారిలో 201 మంది భారతీయులే కావడం విశేషం.

### బెంగుళూరు టాప్

తాజా నివేదిక ప్రకారం భారత్ నుంచి 201 మంది, చైనా నుంచి 194 మంది, యూకే నుంచి 110 మంది యువ వ్యాపారవేత్తలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. దేశంలో అత్యధికంగా బెంగళూరు నుంచి 48 మంది పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో ఉండటంతో, ఆ నగరం 'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 36 నుంచి 40 ఏళ్ల వయసు ఉండి, తొలితరం పారిశ్రామికవేత్తలకు కనీసం 100 మిలియన్ డాలర్లు, వారసత్వ వ్యాపారవేత్తలకు 200 మిలియన్ డాలర్ల వ్యాపార విలువ ఉన్న వారిని ఈ జాబితా కోసం పరిగణనలోకి తీసుకున్నారు.

### పెరుగుతున్న వ్యవస్థాపక స్ఫూర్తి

భారత్‌లో పెరుగుతున్న వ్యవస్థాపక స్ఫూర్తికి అద్దం పట్టేలా, జాబితాలోని భారతీయ పారిశ్రామికవేత్తలలో 83 శాతం మంది తొలితరం వారేనని నివేదిక పేర్కొంది. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవల రంగం నుంచి అత్యధికంగా 40 మంది ఉండగా, ఆ తర్వాత హెల్త్‌కేర్ (18), రవాణా (16), ఆర్థిక సేవల (15) రంగాల వారు ఉన్నారు. ఈ యువ పారిశ్రామికవేత్తల సంస్థల మొత్తం విలువ 357 బిలియన్ డాలర్లు కాగా, ఇవి 4.43 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. 'ఈ తరం పారిశ్రామికవేత్తలు ఇప్పటికే దేశ జీడీపీ, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారు' అని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ అండ్ సీఈవో అపూర్వ సాహిజ్వానీ తెలిపారు. విద్యాసంస్థల పరంగా చూస్తే, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి 15 మంది పూర్వ విద్యార్థులు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళా ప్రాతినిధ్యంలో మాత్రం చైనా (29) ముందుండగా, భారత్ నుంచి 15 మంది మహిళలు ఉన్నారు.

## తెలంగాణలో రష్మీ గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడి

### ఆధునిక స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంసిద్ధత

- దావోస్‌లో సీఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఒప్పందం
- హోటళ్లు, రిసార్ట్స్‌పై టాటాగ్రూప్ ఆసక్తి.. వరుస భేటీలతో బిజీబిజీగా సీఎం రేవంత్ రెడ్డి
- ఫాలో అప్ సదస్సు హైదరాబాద్ నిర్వహించాలని సీఎం ప్రతిపాదన
- తెలంగాణ విజన్ ఆవిష్కరణలో సీఎంతో పాటు చిరంజీవి



**హైదరాబాద్, మహా:** దావోస్ లో తెలంగాణ రైజింగ్. తెలంగాణ ప్రభుత్వ విజన్ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ముందుంది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటన సత్ఫలితాలనిస్తోంది. పారిశ్రామికవేత్తలతో సీఎం వరుస సమావేశాలు జరుపుతుండగా. దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. డీఐ పైపుల సంస్థ రష్మీ గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. స్టీల్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల వరకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది.

మిగతా 2లో



### మూసీ ప్రాజెక్టుపై టాటా గ్రూప్ ఆసక్తి

హైదరాబాద్‌లో స్టేడియాల అప్‌గ్రేడేషన్‌కు టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్‌లో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని టాటా గ్రూప్ ఛైర్మన్‌ను సీఎం కోరారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగస్వామ్యానికి రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మానుఫాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు కోసం చర్చలు జరిపారు. విజన్–2047 లక్ష్యాలు పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను ఈ సందర్భంగా టాటా గ్రూప్ ఛైర్మన్‌కు సీఎం వివరించారు.

### ప్రతీ ఏడాది జూలైలో ఫాలో అప్ సదస్సు

ప్రతి ఏడాది జులై నెలలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన జాయిన్ ది రైజ్ కార్యక్రమంలో సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం- భట్టి విక్రమార్క

### దంతన్ పల్లిలో ఇందిరమ్మ గృహ ప్రవేశం.. కొలాంగూడలో కొమురం సూరు విగ్రహానికి నివాళ్లు

**ఆదిలాబాద్, మహా :** అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు.బుధవారం ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి గ్రామంలో లింగంపెల్లి తారమ్మ ఇందిరమ్మ గృహప్రవేశంలో మంత్రి

మిగతా 2లో

## 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- మునిపిపల్ ఎన్నికల వేళ భారీ బదిలీలు
- ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ నిర్ణయం

02




## పుర పోరు

### వేములవాడలో ట్రయాంగిల్ ఫైట్

- రాజన్న ఆశీస్సులు మరి ఎవరికి దక్కనో
- గెలుపు గుర్రాల కోసం అగ్రనేతల కసరత్తు!
- ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కు అగ్నిపరీక్ష
- రేపో మాపో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్..!

02



# తెలంగాణలో రష్మీ గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడి









(మొదటిపేజీ తరువాయి)

రష్మీ గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర, దక్షిణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. క్లీన్ ఎనర్జీ రంగంలో స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పాటైన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ రూ. 6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) సమర్పించింది.

**బీర్ల తయారీ యూనిట్ తో 600మందికి ఉపాధి**

రాష్ట్రంలోని బీర్ల తయారీ యూనిట్లను ఏబీ ఇన్‌బెవ్ సంస్థ విస్తరించనున్నట్లు దావోస్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో వ్యాపారం నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్ రాష్ట్రంలో రెండు బీర్ల తయారీ యూనిట్లను నడుపుతోంది. రాష్ట్రంలో సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. సర్క్యులర్ వాటర్ వినియోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో రాష్ట్రంతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు. స్థిరమైన పాలసీలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**ఎనర్జీ ప్రాజెక్టులపై ఒప్పందాలు**

దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో న్యూక్లర్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047 నాటికి నెట్ -జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 300 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశాలను న్యూక్లర్ సంస్థ పరిశీలిస్తోంది. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ , డైరెక్టర్ మెలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు.

**విమానయానరంగంలో రూ.వేయికోట్ల పెట్టుబడి**

విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థ రూ.వెయ్యి కోట్లతో తెలంగాణలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ (ఎమ్ ఆర్‌వో) నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశల వారీగా వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సర్గడ్ సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట భేటీ అయ్యారు. ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో అనుభవం ఉన్న సర్గాడ్ సంస్థ రాష్ట్రంలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని , ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్వో కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సంస్థ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి**

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తో కలిసి ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న సీఎం సదస్సుకు రావాలని వెంటనే ఆహ్వానించారు. దీంతో ఆయన సదస్సుకు హాజరయ్యారు. వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ విజన్‌ను ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది.

# 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

## మునిసిపల్ ఎన్నికల వేళ భారీ బదిలీలు
## ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్, మహా :** త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బదిలీలకు సంబంధించిందిన జీవోను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి విడుదల చేశారు. ఒకే చోట సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, తమ సొంత జిల్లాలో పనిచేస్తున్న వారు బదిలీ అయిన జాబితాలో ఉన్నారు. పరిపాలన కారణాలతో పాటు ప్రమోషన్ల వల్ల కూడా బదిలీ అయిన వారు ఈ లిస్ట్‌లో ఉన్నారు. సీవీఎన్ రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా జి.రాజు క్యాతనపల్లిని ప్రభుత్వం నియమించింది. ముసాబ్ అహ్మద్‌ను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, బి శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ గా బదిలీ అయ్యారు. డి జైత్రమ్ ప్రమోషన్ పొంది జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమోషన్ పొందిన బి శరత్ చంద్ర నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. తాజాగా ట్రాన్స్‌ఫర్ అయిన అధికారులు వెంటనే తమను నియమించిన ప్రాంతాల్లో కొత్త బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో విధుల్లో చేరడంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.




**బదిలీ అయిన మునిసిపల్ కమిషనర్లు**

- రామగుండం గ్రేడ్ 3మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు
- రాయికల్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా కీర్తి నాగరాజు
- హాలియా గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి
- అమరచింత గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా నురుల్ నజీబ్
- వేములవాడ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా సంపత్ కుమార్
- ములుగు గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా రమేష్
- తిరుమలగిరి గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా రామ చంద్ర రావు
- ఆదిలాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా జీ రాజు
- ఎదులపురం గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా మునవార్
- బెల్లంపల్లి గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా సంపత్
- భూత్పూర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా చంద్ర శేఖర్ రావు
- నడికొండ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా మురళి
- అచ్చంపేట గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా సీహెచ్ వేణు
- కల్లూరు గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా రామదుర్గ రెడ్డి
- హుజూర్ నగర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా బీ శ్రీనివాస్
- చొప్పదండి గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా టీ మనోహర్
- హుజురాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా ముసబ్ అహ్మద్
- మంచిర్యాల గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా జి అన్వేష్
- ఆలేరు గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి
- మొయినాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా జకీర్ అహ్మద్

# పురపోరు

**వేములవాడ మహా:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం వేములవాడలో మున్సిపల్ ఎన్నికల నగారా మరికొద్ది రోజుల్లో మోగనుండడంతో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. మొత్తం 28 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో ఈసారి ఏ పార్టీ జెండా ఎగురుతుందనేది ఆసక్తికరంగా మారింది. గతంలో ఒకసారి బీజేపీ, మరోసారి బీఆర్ఎస్ పార్టీలు ఇక్కడ అధికారాన్ని చలాయించగా,ఈసారి ఎలాగైనా 'హస్తం' జెండా ఎగురవేయాలని అధికార కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. గెలుపు గుర్రాలను బరిలోకి దింపేందుకు ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్‌కు ఈ ఎన్నికలు నిజమైన అగ్నిపరీక్షగా మారాయి. నియోజకవర్గ కేంద్రంలో తన పట్టును నిరూపించుకోవడంతో పాటు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న సానుకూలతను ఓట్లుగా మలుచుకోవాలని ఆయన గట్టిగా భావిస్తున్నారు. పట్టణ అభివృద్ధికి తాము చేస్తున్న కృషిని వివరించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన అంశం కావడంతో 28 వార్డుల్లోనూ సమర్థులైన అభ్యర్థులను ఖరారు చేసే బాధ్యతను ఆయనే స్వయంగా పర్యవేక్షించనున్నారు.

**పావులు కదుపుతున్న చల్మెడ**

మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని చాటుకునేందుకు సర్వసన్నద్ధమైంది. నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఈ ఎన్నికలను ఒక పెద్ద సవాల్‌గా తీసుకొనున్నారు. గత పదేళ్లలో పట్టణంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తూ క్షేత్రస్థాయిలో ఉన్న బలమైన కేడర్‌ను సమన్వయం చేస్తున్నారు. కాంగ్రెస్ వ్యతిరేక ఓటును చీలకుండా చూస్తూ మరోసారి గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆయన తనదైన శైలిలో పావులు కదుపే అవకాశం వుంది. అభివృద్ధి మంత్రంతో పాటు పాత పరిచయాలను వాడుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బీఆర్ఎస్ పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు కూడా ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని గట్టి నిర్ణయంతో ఉన్నాట్లు తెలుస్తుంది. వేములవాడలో బీజేపీకి ఉన్న పాత పట్టును తిరిగి సాధించేందుకు ఆయన ముమ్మర కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు మరియు హిందూత్వ ఎజెండాతో పాటు పట్టణంలోని పెండింగ్ సమస్యలపై తాము చేస్తున్న పోరాటాలను ప్రజలకు వివరిస్తున్నారు. వికాస్ రావు నేతృత్వంలో బీజేపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత గోప్యంగా పక్కా ప్రణాళికతో సాగుతోంది.

**ఎత్తులు.. వ్యూహాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ మున్సిపల్ పీఠంపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది. ఒకవైపు అధికార బలంతో ఆది శ్రీనివాస్, మరోవైపు కేడర్ బలంతో చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఇంకోవైపు తనదైన ముద్ర వేయాలని వికాస్ రావు తలపడుతుండటంతో 28 వార్డుల్లో పోరు రసవత్తరంగా మారనుంది. గెలుపు గుర్రాల ఎంపికే ఈ పార్టీల భవిష్యత్తును నిర్ణయించనుంది. మూడు పార్టీల అగ్రనేతలు తమ వ్యూహాలకు పదును పెడుతుండటంతో గల్లీ గల్లీలో ఎన్నికల వేడి కనిపిస్తోంది. ఓటరు దేవుడు ఎవరి వైపు మొగ్గు చూపుతాడన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠను రేపుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు ప్రతి అడుగులోనూ ఈ ముగ్గురు నేతలు పోటీ పడనుండడంతో వేములవాడ మున్సిపల్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించనున్నాయి. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోరులో చివరికి రాజన్న ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో వేచి చూడాలి.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం- భట్టి విక్రమార్క

(మొదటిపేజీ తరువాయి)

అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి పాల్గొన్నారు. నూతన గృహాన్నిప్రారంభించి యజమాని తారమ్మను పట్టు వస్త్రాలతో సత్కరించారు.గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని తెలిపారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఇప్పటివరకు జిల్లాకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తూ, పనుల పురోగతిని బట్టి వారం వారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఉట్నూర్ మండలం కోలంగూడ గ్రామంలో కొమురం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో అణచివేతకు వ్యతిరేకంగా కొమరం సూరు సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.గిరిజనుల హక్కుల కోసం కొమురం సూరు సాగించిన పోరాటం ప్రతి తరానికి మార్గదర్శకమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గిరిజనులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నఅటవీ భూమి హక్కుల పట్టాల సమస్యను సమగ్రంగా పరిష్కరిస్తామని, అర్హులైన ప్రతి ఆదివాసీకి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా సౌర జల గిరి వికాసం పథకం ద్వారా గిరిజన భూములకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వివరించారు.అనంతరం పులిమడుగులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి 33 \ 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కు భూమిపూజ చేసారు. కుమ్మరితండాలో గ్రామస్తులతో మమేకమైన అనంతరం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మట్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



## నన్ను చంపితే..ఈ భూమ్మీద
# ఇరాన్ ఉండదు
### ట్రంప్ హెచ్చరిక

**మహా :** ఇరాన్, అమెరికాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి.. ఖమేనీకి హాని తలపెడితే ప్రపంచమే తగలబడిపోతుందని ఇరాన్ హెచ్చరించగా.. తనను హత్య చేస్తే ఇరాన్ భూస్థాపితం అవుతుందని ట్రంప్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థతో ట్రంప్ మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేస్తే.. తాను బతికి ఉన్నా, చనిపోయినా సరే.. ఆ దేశాన్ని భూస్థాపితం చేయాలని తన సలహాదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని ట్రంప్ చెప్పారు. ఇరాన్ లో జరుగుతున్న అల్లర్లకు మద్దతు పలుకుతున్న ట్రంప్ పై ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా ఖమేనీ మండిపడ్డారు. ఈ క్రమంలోనే తమ నాయకుడిపై చేయి వేయాలని చూస్తే ఆ చేతిని తెగనరుకుతామని, ఖమేనీకి ఏదైనా జరిగితే ప్రపంచాన్ని తగలబెడతామని ఇరాన్ సైన్యానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు హెచ్చరించారు. దీనిపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ.. తనను చంపేయాలని చూసినా, చంపేసినా మీరు భూమ్మీదే ఉండరని తీవ్ర హెచ్చరికలు చేశారు.

## మన శంకరవరప్రసాద్
# సిన్మా చూశా
### చిరంజీవితో సీఎం రేవంత్ కుటుంబంతో కలిసి ఆస్వాదించా

**మహా :** తమ కుటుంబసభ్యులతో కలిసి మన శంకరవరప్రసాద్ గారు సినిమా వీక్షించానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెగాస్టార్ చిరంజీవికి చెప్పారు. సినిమాను ఎంతో ఆస్వాదించానని చెప్పారు. ఈ సందర్భంగా చిరంజీవికి ఆ చిత్రం పట్ల సీఎం అభినందనలు తెలిపారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్ వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు జరుగుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు.

# శరవేగంగా పెండింగ్ ప్రాజెక్టులు
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష
### ఎస్ఎల్బీసీపై ఫోకస్.. తుమ్మడిహట్టి వద్ద బ్యారేజీకి డీపీఆర్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను కొనసాగించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల పురోగతిపై తరచూ సమీక్షిస్తూ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూనే నాణ్యతాప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధుల కేటాయింపునకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని, యుద్ధప్రాతిపదికన పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజ్‌కు సంబంధించిన డీపీఆర్ తయారీ కోసం పూర్తిస్థాయిలో సర్వేలు, పరిశోధనలు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. బ్యారేజ్ ప్రాంతంలో అవసరమైన 73 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో టోపోగ్రాఫికల్ సర్వే పూర్తయిందని, దాంతోపాటు 85 కిలోమీటర్ల కాలువ సర్వేను సైతం పూర్తి చేశామని తెలిపారు. అదనంగా వార్ధా, పెన్‌గంగా నదులకు ఇరువైపులా క్రాస్‌సెక్షన్ లెవల్స్ సర్వే పూర్తి అయినందున డీపీఆర్‌లకు తుదిరూపం ఇచ్చేందుకు కసరత్తు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు మట్టి, ఇసుక మేటలతో నిండిపోయి నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి ప్రాజెక్టులలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

# సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు

**ఢిల్లీ, మహా :** సింగరేణిలోని నైనీ కోల్ బ్లాక్ కుంభకోణం అంటూ వస్తున్న వార్తలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలోని బొగ్గు గనుల విషయంలో గత ప్రభుత్వం బీఆర్ఎస్ ఏం చేసిందో.. కాంగ్రెస్ కూడా అదే చేస్తోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో బుధవారం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి సింగరేణి కాలరీస్ ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలు సింగరేణి సంస్థని రాజకీయ ప్రయోగశాలగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్రం పరిశీలిస్తుందని కిషన్ రెడ్డి అన్నారు. నైనీ బ్లాక్‌తోపాటు పూర్తిగా ప్రక్షాళణ చేస్తామన్నారు. మంత్రుల మధ్య వాటాల విభేదాలతో సింగరేణి అంశం బయటకు వచ్చిందన్నారు. దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సంస్థ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడిన కిషన్ రెడ్డి, కేవలం విద్యుత్ ఉత్పత్తికే కాకుండా, దేశ పారిశ్రామిక వృద్ధిలో ఈ సంస్థ భాగస్వామ్యం వెలకట్టలేనిదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కార్మికులు పోషించిన చైతన్యవంతమైన పాత్రను కూడా ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఒకప్పుడు భారీ లాభాలతో వెలిగిపోయిన సింగరేణి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రమంగా ఇబ్బందుల్లోకి వెళ్ళడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక, నిర్వహణ పరమైన సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థ ఉనికికే ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి కేవలం రాష్ట్ర ప్రభుత్వానికే పరిమితం కాదని, ఇందులో 51 శాతం వాటా తెలంగాణ ప్రభుత్వానిది కాగా, 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిదని ఆయన గుర్తు చేశారు. సంస్థ డైరెక్టర్లలో రాష్ట్రానికి చెందిన వారు ఏడుగురు ఉంటే కేంద్రానికి సంబంధించిన వారు ముగ్గురు ఉంటారన్నారు. సంస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ముఖ్యంగా ఒడిశాలోని 'నైని' వంటి కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపులో కేంద్రం చొరవ తీసుకుంటోందని తెలిపారు. ప్రస్తుతం నైనీ కోల్ బ్లాక్‌పై విస్తృతంగా చర్చ జరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గును అందించాలని కేంద్రం నైనీ కోల్ బ్లాక్2 ను తెలంగాణకు కేటాయించిందన్నారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందని, ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించానన్నారు. నైనీ బొగ్గు గనులకు చివరి అనుమతులు వచ్చాక టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందన్నారు. టెండర్లను రద్దు చేయడం సింగరేణికి ప్రత్యక్షంగా అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. సైట్ విజిట్‌కు సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని గుర్తుచేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధన మాత్రమేనని అన్నారు. కానీ, సింగరేణి ఇవ్వాలనే నిబంధన పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీని అర్థం వారికి నచ్చిన వారికి నైనీ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారన్నారు.



## స్థానిక సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

### బల్దియా ముందు ధర్నా చేపట్టిన ఎంసిపిఐయు వరంగల్




**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి వార్డులలోని సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐయు వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయు వరంగల్ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి డివిజన్లో ఎం సి పి ఐ యు వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా సర్వేలు నిర్వహించగా అనేక సమస్యలు ముందుకు వచ్చాయని తెలిపారు. వీటినే పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వారు మండిపడ్డారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ మూలంగా అనేక కుటుంబాలు ముంపునకు గురయ్యాయని అన్నారు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించి వరదలకు నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వ మొద్దు నిద్ర పోతుందని అన్నారు వరంగల్ నగరంలో కోతుల బెడద కుక్కల బెడద తీవ్రంగా పెరుగుతున్నందున ప్రజల భయాందోళనకు గురవుతున్నారని అన్నారు వాటి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని అన్నారు సైడ్ కాలువలు డ్రైనేజ్ సమస్యలను అంతర్గత రోడ్ల మరమ్మత్తులను పరిష్కరించాలని అన్నారు అదేవిధంగా ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని ఇప్పటివరకు ఇందిరమ్మ బిల్లులను ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు 27 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కూడా ఆరు గ్యారెంటీల పథకం అమలు ఊసే లేదని అన్నారు అదేవిధంగా ధూపకుంటలోని నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పేదలకు పంచాలని అన్నారు కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు వరంగల్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు నర్రా ప్రతాప్, ముక్కెర రామస్వామి, ఎగ్గెని మల్లికార్జున్, మాలోత్ ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఖిలా వరంగల్ రంగశాయిపేట, కరీమాబాద్ కాశిబుగ్గ మిడిల్ ఏరియా కార్యదర్శులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలు పాల్గొన్నారు.

## ఎస్వీఎస్ లో ఆరైవ్..ఆలైవ్ అవగాహన కార్యక్రమం

- పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు
- ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** రోడ్డు ప్రమాదాల నివారణ కై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరైవ్..ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కెయూసి పోలీస్ ఇన్స్పెక్టర్ ఎస్. రవికుమార్ అధ్యక్షతన వరంగల్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో భీమారంలోని స్కిల్ స్టోక్ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు విచ్చేసి రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాల పై ప్రసంగించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశంలో జరిగే హత్యలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య అధికమని. గత ఏడాది తెలంగాణలో 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, వాహనదారుడు నిర్లక్ష్యంగా వాహనం నడపడం ద్వారా తనతో పాటు ఇతరులలు కూడా మృత్యువాత పడుతున్నారని. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య అధికమని, ఈ ప్రమాదాలు తగ్గించాలంటే ప్రతి వాహనదారుడు క్రమశిక్షణతో వాహనం నడపాలని, ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ ను అనుసరిస్తూ వాహనం నడపడం ద్వారా, తమ గమ్య స్థానాలకు క్షేమంగా చేరుకుంటారని, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వాహనం ఎవరు నడిపిన, చివరికి పోలీసులైన చర్యలు తప్పవని, ప్రతి వాహదారుడు తన కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని నిర్లక్ష్యంగా వాహనం నడపొద్దని, అదేవిధంగా మీడియా ప్రతినిధులు కూడా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అలాగే ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాల్సి ఉంటుందని జీవితం చాలా విలువైందని, పోలీస్ కమిషనర్ వాహనదారులకు సూచించారు. అనంతరం

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు మాట్లాడుతూ**

ఓ యుద్ధం జరిగినప్పుడు కలిగే ప్రాణ నష్టం కన్నా ప్రతి ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి మరణాల సంఖ్య అధికంగానే ఉంటున్నాయని అన్నారు. నిర్లక్ష్యం కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో అమాయక ప్రజల తో పాటు ఎంతో భవిష్యత్తు ఉన్న యువతను కూడా కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలను చేపట్టడం జరుగుతొందని, ఇందులో భాగంగానే రహదారి ప్రమాదాల నివారణకై ఆరైవ్, ఆలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడబడుతోందని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందిగా పిల్లలు తమ తల్లిదండ్రులకు చెప్పాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం మత్తుపదార్థాల పై కఠినంగా వ్యవహరిస్తూ అణిచివేత ధోరణి ప్రదర్శిస్తుందని, దయచేసి యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో రూపొందించిన ఆరైవ్ఆలైవ్ ప్రచార పోస్టర్లను అధికారులు ఆవిష్కరించి, రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తామంటూ విద్యార్థులతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సీతారెడ్డి, సుజాత, వెంకన్న, శ్రీనివాస్, కేయుసి ఇన్స్పెక్టర్ రవి కుమార్, స్కిల్ స్టోక్ పాఠశాల డైరెక్టర్ అనూప్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఇద్దరు ఇన్స్పెక్టర్ లు బదిలీలు

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కమలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ఇ. హరికృష్ణ ను వి. ఆర్ కు బదిలీ కాగా, ప్రస్తుతం వి ఆర్ లో ఉన్న పి నవీన్ ను కమలాపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ గా నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## తడి పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించాలి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** స్వచ్ఛ వాలంటీర్ లు చెత్తను అందించడం పై ప్రజలకు అవగాహన కలిగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం క్షేత్ర స్థాయి పరిశీలన లో భాగం గా 35 వ డివిజన్ శివ నగర్, అగర్తల తదితర ప్రాంతాల్లో శానిటేషన్,టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సంబంధిత అంశాలను పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ క్షేత్రస్థాయిలో సానిటేషన్ తీరును పరిశీలించి తడి, పొడి చెత్తను హానికర చెత్త (హజార్డస్) ను వేరుగా సేకరిస్తున్నారా? లేదా పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు తడి పొడి చెత్తను వేరుగా అందించడంపై వాలంటీర్ లు అవగాహన కలిగించాలని, ఇందు కోసం ప్రత్యేకంగా వార్డుల వారీగా వారిని నియమించామని వాలంటీర్ లు ప్రజలకు శానిటేషన్ అంశాల పై అవగాహన కలిగిస్తున్నారా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ లోని కొన్ని ప్రాంతాలలో భవన నిర్మాణాదారులు ర్యాంపులు నిర్మించుకోవడాన్ని పరిశీలించిన కమిషనర్ వాటికి అనుమతులు ఇచ్చారా? లేదో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శివనగర్ వాటర్ ట్యాంక్( అగర్తల ప్రాంతంలో)డక్ట్ నిర్మాణ పనులను పరిశీలించి క్యూరింగ్ పీరియడ్ పూర్తి చేయాలని, పక్కనే ఉన్న రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, ఏం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, టి పి ఎస్ అవినాష్ , టి ఎం సి రమేష్ , ఆస్కీ ప్రతినిధి రాజ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ,మేయర్, ఎమ్మెల్యే

**హన్మకొండ మహా;** బల్దియా పరిధిలోని ఒకటవ డివిజన్ లోని పలివెల్పుల మెయిన్ రోడ్డు నుండి ముచ్చర్ల మెయిన్ రోడ్డు వరకు, రెండవ డివిజన్ లోని కురుమ సంఘం నుండి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు అలాగే సార్ల గడ్డ వంగపహాడ్ ప్రాంతం తో పాటు, 66 వ డివిజన్ పరిధి లోని హసన్ పర్తి ప్రాంతాల్లో బల్దియా స్టాంపు డ్యూటీ నిధులు రూ. 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివ కుమార్, బల్దియా అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరమ్మ మీ మేలు మరువను

### వరంగల్ కలెక్టర్ చొరవతో విద్యార్థికి బీటెక్ ప్రొవిజనల్ సర్టిఫికెట్ అందజేత

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వాసి డింగిరి విక్రమ్, తండ్రి రమేష్ ఎస్.ఆర్ యాజమాన్యం ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా విద్యార్థి బీటెక్ సర్టిఫికెట్లను అందించకపోవడంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు విన్నవించారు. ఈ విషయం పై స్పందించిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎస్. ఆర్ యాజమాన్యంతో చర్చించి తమ చొరవతో సంబంధిత విద్యార్థికి బీటెక్ ప్రొవిజినల్ మార్క్స్ మెమో అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి డింగిరి విక్రమ్ జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, మీ చొరవ వల్లనే చదువు వృథా కాకుండా సర్టిఫికెట్లు నా చేతికి అందాయని, దీని వల్ల నాకు ఉద్యోగ అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయని జీవితంలో ఇది మరచిపోలేని సహాయం అని ఆనందం వ్యక్తం చేశాడు.

## మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### రూ.1కోటి 40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కావ్య, మేయర్ సుధారాణి,ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా బుధవారం 66వ డివిజన్ గాంధీ విగ్రహం సమీపంలో సుమారు రూ. 1 కోటి 20 లక్షల నిధులతో సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు, అలాగే విజయ గార్డెన్స్ సమీపంలో రూ. 14 లక్షల వ్యయంతో పైప్‌లైన్ పనుల తో పాటు హసన్పర్తి పెద్ద చెరువు వద్ద రూ. 4.99 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి తమ జీవిత లక్ష్యమని, ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పాలన అందించడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, ఆరోగ్యం, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి డివిజన్‌లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పైప్‌లైన్ పనులు, ఓపెన్ జిమ్‌లు వంటి ప్రజాపయోగ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానమని, నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు, అధికారులు ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు నిజంగా ఉపయోగపడేలా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు



### అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి భువనగిరి, మహా:** బాలకార్మికులను పనులలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హల్ లో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశం లో అదనపు కలెక్టర్,అడిషనల్ డి సి పి లక్ష్మి నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింంహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ 0 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కడ పని చేసిన, వెట్టి చాకిరీ చేయించిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.జనవరి నుండి 97 మంది పిల్లలను రెస్క్యూ చేయటం జరిగిందని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్ లో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారులు వృత్తిపరమైన బాధ్యతగా శ్రద్ధతో పనిచేసి పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. పిల్లల సంరక్షణ కొరకు 1098కు సమాచారం ఇవ్వాలని, ఈ హెల్ప్ లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్ కి సంబంధించిన 3 టీం లు 18 సంవత్సరాల లోపు బాల కార్మిక పిల్లలను పని లో పెట్టుకున్నట్లయితే FIR నమోదు చేసి A1 గా ఓనర్ A2 మేస్త్రి A3 సంబంధిత పరిశ్రమల సూపర్ వైజర్స్ కేసు లు నమోదు చేయాలని అన్నారు. పరిశ్రమల యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ప్రాంతాలు ఉన్న దగ్గర అంగన్వాడీ సెంటర్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో CWC.JJB స్టాఫ్ కమిటీ. బీ ఆర్ బీ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మీ. జిల్లా డీఎంఏచ్ఓ అధికారి మనోహర్. Ad ప్రశాంత్ రెడ్డి. పోలీస్ శాఖ సిబ్బంది. ఎన్జీవో ప్రతినిధులు. చైల్డ్ హెల్ప్ లైన్ CCI సిబ్బంది. జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలి

### ఎస్సై యుగంధర్ గౌడ్

**వలిగొండ, మహా :** జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వలిగొండ మండల కేంద్రంలో ఎస్సై యుగంధర్ గౌడ్ వారోత్సవాలను పురస్కరించుకొని వాహనదారులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి అని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం నిషేధమని డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు వాహనాలు నడుపుతున్న సమయంలో మద్యం సేవించి నడపరాదన్నారు వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లడం మంచిదని అన్నారు నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు




## గెజిటెడ్,నాన్ గెజిటెడ్ సంఘాల నూతన డైరీ ఆవిష్కరణ

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధికారుల నూతన డైరీ 2026, క్యాలెండర్ ను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), యాదాద్రి భువనగిరి భాస్కర్ రావు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగులు క్రమశిక్షణ తో పనిచేస్తూ, రాష్ట్రంలో జిల్లాను అన్ని రంగాలలో ప్రథమ GB స్థానంలో నిలిపినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లా లోని ఉద్యోగులు జె.ఏ.సి. చైర్మెన్ మందడి ఉపేందర్ రెడ్డి గారి అధ్వర్యంలో ఒకే తాటిపై నిలిచి ముందుకు నడుస్తున్నారని, ఇది ఎంతో మంచి పరిణామమని తెలుపుతూ, జిల్లాలోని ఉద్యోగులందరికి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మందడి ఉపేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## అవి హైనా కాలి అడుగులే.. పులికాదు





**ఆలేరు ,మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెంలో రైతు సుధాకర్ వ్యవసాయ బావి వద్ద అడవి జంతువు హైనా కాలి అడుగులను మంగళవారం ఫారెస్ట్ అధికారులు గుర్తించారు... కాలి ముద్రలను చూసిన గ్రామస్థులు పులివిఏమో అనుకొని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ వున్న కాలి అడుగులు అడవి జంతువు హైనావి గుర్తించినట్లు ఫారెస్ట్ అధికారి రమేష్ తెలిపారు అది గొర్రెలను,మేకలను టార్గెట్ చేస్తుందని రైతులు జాగ్రత్తగా వుండాలని చెప్పారు.. పెద్దగా ప్రమాదం కాదని అయిన రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు... గ్రామ సర్పంచ్ ఏసిరెడ్డి మంజుల మహేందర్ రెడ్డి రైతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు... హైనా ఆకలిగా వున్నప్పుడు ఒక్కొక్కసారి మనుషుల పైకూడ దాడి చేయ వచ్చాని కాలి ముద్రాల ప్రకారం అవి హైనా కాలి ముద్రాలేనవి పులివి కావాని ఫారెస్ట్ అధికారులు తెల్చి చెప్పారు...

## శివరాత్రి, రంజాన్ పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు

### భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రాథమికం ఎమ్మెల్యే నాయిని




**హన్మకొండ మహా:** రానున్న శివరాత్రి రంజాన్ పండుగలను పురస్కరించుకొని హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివరాత్రి హిందూ భక్తులకు అత్యంత పవిత్రమైన పండుగని, నగరంలోని ప్రధాన శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఒక్క భక్తుడికైనా అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్యూ లైన్ నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భక్తులు క్రమబద్ధంగా దర్శనం చేసుకునేలా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తొక్కిసలాట వంటి ఘటనలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. వెయ్యి స్తంభాల దేవాలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయానికి సమీపంలోని ఖాళీ స్థలాన్ని వినియోగించి క్యూ లైన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్యూ లైన్‌లో నిలిచే భక్తులకు తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని, అవసరమైన చోట్ల వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సిద్ధేశ్వర దేవాలయం సహా నగరంలోని అన్ని శైవ ఆలయాల పరిసరాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సహాయం వంటి అంశాలను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైనదైనందున, ఉపవాసాలు మరియు ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మసీదులు, ఈద్గా ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీటి అందుబాటు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇంజనీరింగ్ శాఖలు సమిష్టిగా పనిచేసి రెండు పర్వదినాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజిత్ ఖాన్,అడిషనల్ కలెక్టర్,ఆర్డీఓ,ఆయా మతాల మాత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి మరో బిగ్ షాక్..





**నాగర్ కర్నూల్ జిల్లా మహా:** బీఆర్ఎస్ పార్టీ నీ విడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్స్ తిరుమల్ యాదవ్,ఇసాక్ ,మోతి , BRS టౌన్ ప్రెసిడెంట్ బాదం రమేష్ ,నాయకులు పాలమూరు యాదయ్య, హరి కృష్ణ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన ఎంఎల్సీ దామోదర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి..

**జిల్లా కేంద్రంలోని 16 వ వార్డులో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పర్యటన**


వార్డులో నూతనగా పూర్తి అయిన బోర్ ని ప్రారంభించారు .వార్డులోని పర్యటించి, ఇటీవల పూర్తయిన నూతన రహదారులు మరియు డ్రైనేజీ పనులను పరిశీలించారు.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

**జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు – 2026 ఘన ప్రారంభం**

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమం డ్రంక్ అండ్ డ్రైవ్ – అరైవ్ అండ్ లైవ్” నినాదంతో అవగాహన ర్యాలీ విద్యార్థులతో కలిసి నిర్వహించిన రహదారి భద్రత ర్యాలీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ హాజరైన జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ పాటిల్ పాల్గొన్న అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా రవాణా అధికారి డీటీఓ బాలు పాల్గొనడం డీఎస్పీ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రవి నాయక్ హాజరు డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లే ఎక్కువ రహదారి ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం అమాయకుల ప్రాణాలకు ప్రమాదం హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా వాడాలి – సూచన ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి యువత, విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి సమాజంలో మార్పుకు యువత ముందుండాలి రహదారి భద్రత మాసోత్సవాలు ప్రమాదాల తగ్గింపుకు దోహదం ప్రజల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో కార్యక్రమాలు పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.



# బీజేపీ మూడవతరానికి సారధి
# నితిన్ నబిన్



ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ రాబోయే మూడు తరాలకు సరిపడా ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నిక కావడం ఆ పార్టీలో, పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వాలలో యువ నాయకుల జోరు స్పష్టం అవుతుంది. ఈ యువ నాయకత్వాన్ని మరింతగా ప్రోత్సహించడంతో పాటు రాబోయే తరాల అంచనాకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకు వెళ్ళడమే ధ్యేయంగా కనిపిస్తోంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన, కొన్ని వారాల క్రితం వరకు నితీష్ కుమార్ క్యాబినెట్ లో మంత్రిగా ఉన్న నబిన్, ఇప్పుడు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీలో అత్యున్నత స్థానానికి ఎదిగిన వారిలో ఆయనే అతి పిన్న వయస్కుడు కావడం గమనార్హం.

ఈ ఎంపికనే కాదు బీజేపీ నాయకత్వం ఇలాంటి అనూహ్య ఎంపికలు ఇప్పటివరకు ఎన్నో చేసింది. కానీ జాతీయ అధ్యక్షుడిగా నబిన్ ఎంపిక ఒక బలమైన సంకేతాన్ని పంపింది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ఒక తరాల మార్పుతో ప్రయోగాలు చేస్తోందని. ఇది పదేళ్ల క్రితం పార్టీ తొలిసారిగా పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభమైన ఒక స్పష్టమైన ప్రక్రియలో భాగం. ఇటీవలి సంవత్సరాలలో, బీజేపీ ముఖ్యమంత్రి, క్యాబినెట్ పదవులకు ఎంపిక చేసిన వారిలో చాలా మంది 55 ఏళ్లలోపు వారే ఉన్నారు. బీజేపీ ఆవిర్భావంలో అటల్ బిహారీ వాజ్ పేయి, ఎల్ కే అద్వానీలు, ఆ తర్వాతి తరంగా నరేంద్ర దామోదర్ దాస్ మోడీ, అమిత్ షాలు నిలబడ్డారు. వీరి తర్వాత పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారన్న చర్చ జోరందుకున్న తరుణంలో అనూహ్యంగా నితిన్ నబీన్ ను ఎంపిక చేసి దేశ ప్రజల ఆలోచనలకు అధి నాయకత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. నబిన్ రాకతో బీజేపీలో యువ నాయకత్వానికి పెద్ద పీట ఉంటుందన్న విషయాన్న విషయాన్ని కాషాయాధినేతలు చెప్పకనే చెప్పారన్న చర్చ జోరందుకుంది.

రాజస్థాన్‌కు చెందిన భజన్‌లాల్ శర్మ, ఢిల్లీకి చెందిన రేఖా గుప్తా, మధ్యప్రదేశ్‌కు చెందిన మోహన్ యాదవ్ వంటి కొందరిని అక్షరాలా వెనుక వరుసల నుండి ముందు వరుసలకు తీసుకువచ్చారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నత పదవులు ఇచ్చే వారి నుండి చాలా కష్టపడి పనిచేయాలని, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ఆశిస్తారు. ఇక్కడ యువ నాయకులకు ఒక ప్రయోజనం ఉంది, ఎందుకంటే వారు మరింత సౌకర్యవంతంగా పనుల కోసం తిరగగలరు. ప్రతి కొన్ని గంటలకు ఒక మాత్ర వేసుకోవాల్సిన వ్యక్తి ఈ పాత్రకు సరిపోవడం కష్టం," అని ఒక బీజేపీ నాయకుడు అభిప్రాయపడ్డారు. 14 రాష్ట్రాల్లోని ప్రస్తుత బీజేపీ ముఖ్యమంత్రుల విశ్లేషణ ప్రకారం, వారిలో కేవలం ఐదుగురు మాత్రమే త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా (70), గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ (60), ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి (59), మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ (58), రాజస్థాన్ ముఖ్యమంత్రి శర్మ (56) ప్రమాణ స్వీకారం చేసే సమయానికి 55 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు.

మిగిలిన తొమ్మిది మంది ముఖ్యమంత్రులు చివరిసారిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు వారి వయస్సు 55 ఏళ్లలోపే ఉంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పేమా ఖండూకు 44 ఏళ్లు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మకు 52, ఢిల్లీకి చెందిన రేఖా గుప్తాకు 50, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు 48, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీకి 54, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు 54, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝీకి 52, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు 49, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి 46 ఏళ్లు. గత నాలుగు సంవత్సరాలలో బీజేపీ ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం చేసే సమయానికి వారి సగటు వయస్సు 54 సంవత్సరాలు. అయితే, పార్టీ అధ్యక్షులను నియమించే విషయంలో పార్టీ సమతుల్యతను పాటించింది. వీరిలో చాలా మందికి 55 ఏళ్లకు పైబడిన వయస్సు ఉంది. ఒక ఆంగ్ల పత్రిక చేసిన విశ్లేషణ ప్రకారం, 20 మంది రాష్ట్ర అధ్యక్షులు ఆ పదవికి ఎన్నికైనప్పుడు 55 ఏళ్లకు పైబడిన వారు కాగా, 14 మంది 55 ఏళ్లలోపు వారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించినప్పుడు వారి సగటు వయస్సు 58 సంవత్సరాలు. ఇది ముఖ్యమంత్రుల సగటు వయస్సు కంటే ఎక్కువ. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులలో చాలా మంది పేర్లు గత ఒక సంవత్సరంలో జరిగిన సంస్థాగత ఎన్నికల సమయంలో ప్రకటించారు. "పార్టీ పూర్తిగా యువ తరానికి పగ్గాలు అప్పగించడం లేదు, కానీ వివిధ పదవులలో వయస్సుల మిశ్రమాన్ని నమ్ముతుంది, ఇది యువత, అనుభవంల సరైన సమ్మేళనాన్ని అందిస్తుంది" అని ఓ నాయకుడు చెప్పారు. అస్సాం, మహారాష్ట్ర మినహా, ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలలో, ముఖ్యమంత్రి కంటే ఎక్కువ వయస్సు ఉన్న రాష్ట్ర అధ్యక్షులను నియమించడం ద్వారా పార్టీ యువత, అనుభవం మధ్య సమతుల్యతను పాటించింది. ఇటీవలి ఉదాహరణగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మార్చి 2022లో వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఆయన వయస్సు 49 సంవత్సరాలు కాగా, కొత్తగా నియమితులైన యూపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వయస్సు 61 సంవత్సరాలు. పదవీ విరమణ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ చౌదరి 2022లో బాధ్యతలు స్వీకరించినప్పుడు ఆయన వయస్సు 54 సంవత్సరాలు. అస్సాం దీనికి మినహాయింపు, అక్కడ జనవరి 2025లో దిలీప్ సైకియా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైనప్పుడు ఆయన వయస్సు 51 సంవత్సరాలు, అయితే 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవికి బీజేపీ శర్మ పేరును నిర్ణయించినప్పుడు ఆయన వయస్సు 52 సంవత్సరాలు. శర్మ వయసు ప్రస్తుతం 56. అదే విధంగా, మహారాష్ట్రలో యువ బృందం ఉంది. డిసెంబర్ 2024లో ప్రమాణ స్వీకారం చేసే సమయానికి సీఎం ఫడ్నవీస్ వయసు 54, పార్టీ జూలై 2025లో 54 ఏళ్ల మరాఠా అభ్యర్థి రవీంద్ర చవాన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. మొత్తం యువత ప్రోత్సాహానికి విరుద్ధంగా, ఈ క్రమాంకనం చేసిన తరాల ప్రోత్సాహం రాష్ట్ర మంత్రివర్గాలలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఢిల్లీ సగటున 50 సంవత్సరాలు ఉన్న అతి పిన్న వయస్కులైన మంత్రివర్గంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రమాణ స్వీకారం చేసే సమయానికి 55 కంటే ఎక్కువ వయస్సు ఉన్న ఒకే ఒక మంత్రి (58 ఏళ్ల ఆశిష్ సూద్) ఉన్నారు. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, ఉత్తరాఖండ్‌లలో కూడా యువ మంత్రివర్గాలు ఉన్నాయి, 55 ఏళ్లలోపు మంత్రులు ఎక్కువగా ఉన్నారు. అయినప్పటికీ వృద్ధ నాయకులు క్యాబినెట్ లో సీనియర్ పదవులను నిర్వహిస్తున్నారు. ఒడిశా వంటి రాష్ట్రాలు కూడా యువ నాయకత్వం వైపు మొగ్గు చూపుతాయి, పాత మంత్రులను పూర్తిగా స్థానభ్రంశం చేయకుండా. దీనికి విరుద్ధంగా, పెద్ద, రాజకీయంగా సంక్లిష్టమైన రాష్ట్రాలు మరింత జాగ్రత్తగా ఉంటాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో మంత్రివర్గాలు సమానంగా విభజించారు లేదా పాత మంత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యమంత్రి 55 ఏళ్లలోపు ఉన్నప్పటికీ, గోవా, హర్యానాలలో సాపేక్షంగా చిన్న ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ మొత్తం మీద పెద్ద మంత్రుల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఎన్డీయే పాలిత తొమ్మిది రాష్ట్రాలలో బిజెపికి 15 మంది ఉప ముఖ్యమంత్రులు ఉన్నారు. వారు బాధ్యతలు స్వీకరించినప్పుడు వారి సగటు వయస్సు 57 సంవత్సరాలు.

> ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ రాబోయే మూడు తరాలకు సరిపడా ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నిక కావడం ఆ పార్టీలో, పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వాలలో యువ నాయకుల జోరు స్పష్టం అవుతుంది.

> ఈ ఎంపికనే కాదు బీజేపీ నాయకత్వం ఇలాంటి అనూహ్య ఎంపికలు ఇప్పటివరకు ఎన్నో చేసింది. కానీ జాతీయ అధ్యక్షుడిగా నబిన్ ఎంపిక ఒక బలమైన సంకేతాన్ని పంపింది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ఒక తరాల మార్పుతో ప్రయోగాలు చేస్తోందని. ఇది పదేళ్ల క్రితం పార్టీ తొలిసారిగా పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభమైన ఒక స్పష్టమైన ప్రక్రియలో భాగం.

బీజేపీ నాయకత్వం నితిన్ నబిన్ కు కీలక బాధ్యతలను అప్పగించడం వ్యూహాత్మకతమే. దేశంలో వారసత్వ పార్టీలకు చెక్ పెట్టాలని గత కొన్నాళ్ళుగా బీజేపీ ప్రయత్నిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ తో పాటు దేశంలోని పలు పార్టీలు, ఆయా రాష్ట్రాలలోని పలు ప్రాంతీయ పార్టీలన్నీ వారసత్వ రాజకీయాలతో మునిగిపోయాయి. వీటన్నింటికీ భిన్నం బీజేపీ అని చెబుతున్న కాషాయాధినేతలు చెప్పడం కాదు చేతల్లోనూ చేసి చూపిస్తూ ప్రజల్లో మరింత విశ్వాసాన్ని సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బీజేపీలో పని చేసే వారికి ప్రాధాన్యముంటుందన్న విషయాలను అనేక సందర్భాలలో నిరూపణ అయింది. అంతేకాదు వినయ వీర విధేయులకు ఎప్పుడో ఒకప్పుడు అందలం తప్పదన్న సంకేతాలను కూడా నబిన్ నియామకంతో నిరూపించారు. ఆయా రాష్ట్రాలలో సీఎల ఎంపిక ప్రక్రియను అంచనాలకు అందకుండా తీసుకున్న నాయకత్వం పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక కూడా అదే కోవలోనే తీసుకుని నిర్ణయాలలో తమకు తామే సాటి అని చెప్పకనే చెప్పారు. నిన్నటి వరకు నితిన్ నబిన్ ఎవరన్నది దేశంలోని చాలా మంది నేతలకూ తెలియదు. అంతెందుకు బీజేపీలోని పలువురి నేతలకు కూడా ఆయన పేరు పరిచయం లేదు. అలాంటిది ఒక్కసారిగా ఆయనను జాతీయ అధ్యక్ష పీఠంపై అధిష్టింప చేసి పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పుడూ అన్యాయం జరగదని నేటి యువతకు సంకేతాలిచ్చారు. బీజేపీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్దేశించిన ప్రకారం కానీ, బీజేపీ సంస్థాగతంగా తనకు తాను విధించుకున్న నిబంధన ప్రకారం కానీ 75 సంవత్సరాల వయసు మీరితే వారు రాజ్యాంగ పదవులకు దూరంగా ఉండాలి, ప్రస్తుత ప్రధాని వయసు 75 సంవత్సరాలు పూర్తయింది. అయన స్థానంలో ఎరు వస్తారు, ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే దేశంలో మారుతున్న సమీకరణలు, అంతర్జాతీయ స్థాయిలో దేశం పట్ల పెరుగుతున్న ఆధరణ, కొన్ని దేశాల నుంచి దేశానికి ఎదురవుతున్న సవాళ్ళు తదితర పరిణామాల నేపథ్యంలో నరేంద్ర మోడీ కనక ప్రధాని పదవిని త్యజిస్తే అంతటి శక్తి, యుక్తి, సామర్థ్యం, చాతుర్యం ఉన్న నేతలెవరన్న అంశంపై కూడా చర్చ జరుగుతోంది. దీనికీ ఒక పరిష్కారం ఉందని, సరైన సమయంలో సరైన నిర్ణయాన్ని పార్టీ తీసుకుంటుందని, ఇందులో ఎవరికీ ఎలాంటి సందేహాలు అవసరం లేదని పార్టీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. కానీ పార్టీ పదవి వేరు, ప్రధాని పదవి వేరు కాబట్టి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నది పార్టీ ఆలోచనగా కనిపిస్తోంది.



- గడ్డం కృష్ణ మూర్తి
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

> బీజేపీ నాయకత్వం నితిన్ నబిన్ కు కీలక బాధ్యతలను అప్పగించడం వ్యూహాత్మకమే. దేశంలో వారసత్వ పార్టీలకు చెక్ పెట్టాలని గత కొన్నాళ్ళుగా బీజేపీ ప్రయత్నిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ తో పాటు దేశంలోని పలు పార్టీలు, ఆయా రాష్ట్రాలలోని పలు ప్రాంతీయ పార్టీలన్నీ వారసత్వ రాజకీయాలతో మునిగిపోయాయి. వీటన్నింటికి భిన్నం బీజేపీ అని చెబుతున్న కాషాయాధినేతలు చెప్పడం కాదు చేతల్లోనూ చేసి చూపిస్తూ ప్రజల్లో మరింత విశ్వాసాన్ని సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.


> నిన్నటి వరకు నితిన్ నబిన్ ఎవరన్నది దేశంలోని చాలా మంది నేతలకూ తెలియదు. అంతెందుకు బీజేపీలోని పలువురి నేతలకు కూడా ఆయన పేరు పరిచయం లేదు. అలాంటిది ఒక్కసారిగా ఆయనను జాతీయ అధ్యక్ష పీఠంపై అధిష్టింప చేసి పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పుడూ అన్యాయం జరగదని నేటి యువతకు సంకేతాలిచ్చారు.

## మంత్రి సీతక్కను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు నివాసంలో ఆమెను కలిసి పూలబొకే అందించి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు.ఆదిలాబాద్ నియోజక వర్గ రాజకీయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు,మాజీ కౌన్సిలర్ సందా నర్సింగ్ ,చిన్నయ్య, డేరా కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

## బాసర జ్ఞాన సరస్వతీ సేవలో గరికపాటి



**ఆదిలాబాద్ మహా :** నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త పద్మశ్రీ డా.గరికపాటి నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రవచన సభలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో రెండు గంటల పాటు ఏర్పాటు చేసిన ప్రవచనాలు వినడానికి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి




**ఆమనగల్లు, మహా:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని టియుఎఫ్ఎస్ఐడిసి చైర్మన్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని పల్లె చెల్కతండా,చరికొండగ్రామాల్లో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని కడ్తాల మండల కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టియుఎఫ్ఎస్ఐడిసి చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి వీబీ జీ రామ్ జీ వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం పథకాల పట్ల బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు సొంత రాజకీయ లబ్ది కోసమేనని తక్షణమే వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్,శ్రీనివాస్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్,వెంకటేష్, సీనియర్ నాయకులు అద్దాల రాములు గౌడ్, సర్పంచ్ లు పాలకుర్ల మహేందర్ గౌడ్, కర్ణాకర్ గౌడ్,నర్సింహ గౌడ్,రవి,రౌతు వెంకటయ్య ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విపత్తులపై అవగాహన కల్పించేలా ఎన్డిఆర్ఎఫ్ మాక్ డ్రిల్...





**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆవరణలో బుధవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్ డి ఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తులపై అవగాహన కల్పించేలా మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడటం, తుఫానులు వంటి అనుకోని ప్రమాదాలు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎన్ డి ఆర్ ఎఫ్ టీం సభ్యులు విపత్తుల సమయంలో ప్రజలను ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలి, ప్రమాదాల నుంచి ఎలా రక్షించాలి అనే అంశాలను అధికారులు, సిబ్బందికి వివరించారు. అలాగే ప్రమాదాలు జరిగిన వేళ ప్రజలు తమను తాము ఎలా కాపాడుకోవాలి, భద్రతా చర్యలు ఏమిటి అనే విషయాలపై మాక్ డ్రిల్ ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం చేపట్టే సహాయక చర్యలు అత్యంత సమర్థవంతంగా ఉంటాయని తెలిపారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఇతర జిల్లా అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, టి జి ఎస్ డి ఆర్ ఎఫ్, డి డి ఆర్ ఎఫ్ బృందాలు, ఆపద మిత్రా టీం, జిల్లా అగ్నిమాపక సిబ్బంది, మెడికల్ టీమ్స్, పోలీస్ అధికారులు, విమానాశ్రయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నతమైన భవిష్యత్తు

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాల పరిశీలన
- పాఠశాలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచాల మండలం లోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల యొక్క స్థితిగతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచాల మండల కేంద్రంలోని సర్కార్ జూనియర్ కళాశాలలో కొత్తగా భవనాలను ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ... విద్యార్థుల కోసం సర్కార్ కళాశాలలో బాక్స్ క్రికెట్, వాలీబాల్, కొక్కో, షటిల్, అథ్లెటిక్స్ ఆటల కొరకు గ్రౌండ్ను అభివృద్ధి చేయాలని సూచించడం జరిగింది అన్నారు. సర్కారు బాల బాలికల ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను సమీక్షించడం జరిగిందని, అలాగే బాలికల పాఠశాలలో ఉన్న నాలుగు గదులను బిసి వసతి గృహానికి కేటాయిస్తూ, అదనపు గదుల కోసం, భవనం పైన మరో అంతస్తు నిర్మించాలని తెలిపారు. విద్యతోనే ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని, రాష్ట్ర సర్కార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, విద్యార్థులు ఉన్నతంగా చదివి తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల విద్యాధికారి రాందాస్, కళాశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంచాల కన్వీనర్ ఆర్ నారాయణ రెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూబియాన, వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి అధికారి రమేష్, మంచాల బాలికల హాస్టల్ వార్డెన్ శశిరేఖ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, విద్యా కమిటీ సభ్యులు అశ్వాల బాలరాజ్, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, లింగం, గీత, సంకీర్తన, విజయ, ముత్యాలు, సువర్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.



## ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ కర్తవ్యం

**సివరేజ్ పైపు లైన్ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన**

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే కర్తవ్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.హైదర్ గూడ డివిజన్ లో సుమారు 16 లక్షల రూపాయలతో చేపట్టిన సివరేజ్ పైపు లైన్ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్థానిక కార్పొరేట్ సంగీత తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ లలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహేష్, ప్రవీణ్ రెడ్డి, మహేందర్' మ్యాడం రమేష్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.




## మొయినాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా జాకీర్ అహ్మద్

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ నూతన మున్సిపల్ కమిషనర్ గా జాకీర్ అహ్మద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించానని ఆయన తెలిపారు. మునుపటి కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ భైంసాకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాకీర్ అహ్మద్ కు స్థానికులు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.




## విద్యా ప్రజాసేవకు దిక్సూచి: మాజీ ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** విద్య ప్రజాసేవకు దిక్సూచి లాంటిదని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. బుధవారం కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ సాధించిన సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే, నాయకులు సన్మానించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సేవతో పాటు విద్యను సమన్వయం చేస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. సమాజంలో మార్పు అవగాహనతో కూడిన విద్య అవసరమని, యువత ఆదిశలో పయనించాలన్నారు.


# అగ్ని ప్రమాద బాధితున్ని ఆదుకుంటాం

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి చౌరస్తాలో మంగళవారం రాత్రి వాటర్ సర్వీసింగ్ సెంటర్లో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితుడైన అంతారం గ్రామానికి చెందిన నగేశకు ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. బుధవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆయన తహశీల్దార్ రమేశ్తో మాట్లాడి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.అనంతరం కోరింత కుంట తాండ గ్రామపంచాయతీలో పట్టుపురుగు పరిశ్రమల రిసోర్స్ సెంటర్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి, సెరికల్చర్,హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా ఐఏఎస్ హాజరై సెంటర్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజక వర్గ పరిధిలోని రంగారెడ్డి, నాగర్ కర్నూల్జి ల్లాల మండలాలకు 1,500 స్ప్రింక్లర్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.



# పోటీ చేస్తున్నా.. అవకాశమివ్వండి

- నోటిఫికేషన్కు ముందే మొదలైన ప్రచారం
- ఓటర్లను కలుస్తున్న ఆశావహులు



**మొయినాబాద్ మహా:** వార్డులో అధికార కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ బీజేపీ పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న ఆశావహ అభ్యర్థులు కాలనీలోని ఓటర్ల ఇళ్లను సందర్శిస్తున్నారు మన వార్డులో ఈసారి కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నానని తనను ఆశీర్వదించాలని వారిని కోరుతున్నారు ఓటర్ల జాబితాను పట్టుకుని ఇంటింటా తిరుగుతు ఓటర్లను అప్యాయంగా పలుకరించి యోగాక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈసారి కౌన్సిలర్ బరిలో ఉన్న తనకు అవకాశమివ్వాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ ఇంకా రాలేదు. రాజకీయపార్టీలు ఇప్పటిదాక అభ్యర్థులు ఖరారు పై ప్రకటన చేయలేదు. అయినప్పటికి ఆశావహుల ప్రచారం మాత్రం మొదలైంది. ఎన్నికల బరిలో ఉంటున్నామని, తమను ఆదరించాలంటూ ఓటర్ల మద్దతు కూడగట్టుకునే పనిలో పడ్డారు. ఓటర్ల జాబితా పట్టుకుని వార్డుల్లో ఇంటింటా తిరుగుతున్నారు. ఓటర్లను అప్యాయంగా పలుకరిస్తున్నారు. కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నానని చెబుతూ మీ ఓట్లన్ని తనకే వేయాలంటూ కోరుతున్నారు. దీంతో నోటిఫికేషన్కు ముందే వార్డుల్లో ప్రచార సందడి కనిపిస్తోంది.

**ఒక్కో వార్డులో కనీసం ఐదుగురు పోటీ**

మున్సిపల్ పరిధిలో మొత్తం 26 వార్డులున్నాయి. ప్రతీ వార్డులో కనీసం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తో పాటు ఒక్కరిదరు ఇండిపెండెంట్ గా బరిలో ఉండే అవకాశం కనిపిస్తుంది. ఆయా పార్టీల తరపున సీట్లను దక్కించుకునేందుకు ఆశావహులు అన్నివిధాలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. . ఈ లెక్కన ఒక్కో వార్డుకు ఐదుగురు పోటీపడే అవకాశముంది.

**ఓటర్లను కలిసి మద్దతు కోరుతూ..**

ఆశావహులు ఆయా వార్డుల్లోని ఓటర్లను కలుస్తున్నారు. కుటుంబంలో ఓటర్లపై ఆరా తీస్తున్నారు. కౌన్సిలర్గా పోటీ చేస్తున్నానని, తమను ఆశీర్వదించి అండగా నిలువాలని వేడుకుంటున్నారు. తమను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. ఇందులో తమకు అనుకూలంగా వచ్చే ఓట్లు ఎన్ని.. అనుకూలంగా మలుచుకునేందుకు అవసరమైన ఓటర్ల ఎంత అనే వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

## వచ్చే ఎన్నికలలో బిజెపి సత్తా చాటాలి..

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్ర నియోజక వర్గంలోని అత్తాపూర్ రాంబాగ్ లో బిజెపి యువ నాయకులు అమర్ రెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన బిజెపి పార్టీ కార్యాలయాని చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించి బుధవారం నూతన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ నాయకులు నూతనంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. బిజెపి నాయకుల కార్యకర్తల్లో చైతన్యాన్ని నింపిని అమర్ రెడ్డి వెంకట్ రెడ్డి ని అభినందించారు. ఇలాగే ముందుకు వెళ్లాలని వచ్చే మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ఎన్నికలలో బిజెపి పార్టీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్లు బిజెపి ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులనే కొనసాగించాలి

- కార్మికులకు ఉపాధి కల్పించాలి
- మధ్యాహ్నం భోజనం పథకం అధ్యక్షురాలు వై స్వప్న



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రస్తుతం పని చేస్తున్న వంట కార్మికులనే కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం, ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రస్తుతం పని చేస్తున్న వంట కార్మికులనే కొనసాగించాలని, మధ్యాహ్నం భోజనం పథకం యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు వై స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ కు, కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆరుట్ల గ్రామంలోని అన్ని పాఠశాలలను ఒకే దగ్గర చేర్చి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో వంట పని చేయడానికి కొత్తగా వంట కార్మికులను నియమిస్తున్నారని అన్నారు. కొత్త వారిని నియమించకుండా గత 20 సంవత్సరాలుగా వంట పని చేస్తూ వస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులనే నియమించుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజనం పథకం యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కల్పన, సరిత కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా మండలి కార్యాలయంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని అనుమతించం: మహిళా నాయకులు



**రాజేంద్రనగర్ , మహా :** సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ప్రభుత్వ సొంత భవనాలలో ఉండాలన్న ప్రభుత్వం ఆదేశాలతో రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలోకి మార్చే ప్రయత్నం సబ్ రిజిస్టర్ అధికారులు బుధవారం చేశారు. గతంలో రాజేంద్రనగర్ వార్డు కార్యాలయం మహిళా మండలి కార్యాలయంగా ఉండేది. అవసరాల రీత్యా రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంగా గతంలో అధికారులు వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వార్డు కార్యాలయాన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయంగా వినియోగించుకోవాలి అనే అధికారుల ఆదేశాలతో సబ్ రిజిస్టర్ అధికారులు వార్డు కార్యాలయాని తమ ఆధీనం లోకి తీసుకునే ప్రయత్నం చేయగా మహిళా నాయకులు అడ్డు తగిలి తమకు ప్రత్యామ్యంగా మరో కార్యాలయాన్ని చూపించిన తర్వాతే ఇందులోకి రావాలని అధికారులను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక అక్కడినుంచి వెళ్లిపోయారు. మహిళా మండలి నాయకులు గతంలో వార్డు కార్యాలయం మహిళా మండలి కార్యాలయంగా ఉండేది. అప్పటి అధికారులు వార్డు కార్యాలయంగా వాడుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఖాళీగా ఉండడంతో తాము ఆధీనంలో ఉందిఅని తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంగా మార్చడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. తమకు ప్రభుత్వ పెద్దలు అధికారులు మహిళా మండలికి మరో భవనం కేటాయించిన తర్వాతే ఈ భవనంలోకి రావాలని పట్టు పట్టారు.

## ఆదిలాబాద్ నూతన మున్సిపల్ కమీషనర్‌గా రాజు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్ గా జి. రాజు నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కమిషనర్లకు స్థానచలనం కల్పించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు బదిలీ కాగా ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కమిషనర్ గా పని చేస్తున్న జి. రాజును ఆదిలాబాదు కు బదిలీ చేసింది.



## మదరసాలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ సమీపంలోని మదరసా పాఠశాలలో బుధవారం మైనార్టీ విద్యార్థులకు వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల లోని 72 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్లు మైమూన బేగం, విజయలక్ష్మి, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.



## కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం మర్రిపల్లి గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నాగిరెడ్డి చెప్పారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా పెద్దయ్య, డైరెక్టర్లుగా నరసింహ, జంగయ్యలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్ర కిరణ్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, చానా గౌడ్, సిబ్బంది ఉపేందర్, రాంరెడ్డి పాల్గొన్నారు




## రోడ్డు భద్రతను పాటించండి

**రోడ్డు ప్రమాదాలపై యువకులకు అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలో అర్రైవ్ అలైవ్ 2026 క్యాంపెయిన్ 9వ రోజు శంషాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఏసిపి నాగభూషణం సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతపై ప్రార్థన మందిరాలకు వెళ్తున్న మైనారిటీ యువకులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత పెద్దలు యువకులకు రోడ్డు భద్రతలపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. పండగల సమయలో ట్రాఫిక్ నియమాల ప్రణాళికలతో ట్రాఫిక్ నియంత్రణకు వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాలను యువకులకు వివరించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు, యువకులు, స్థానికులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల సమయానికి బస్సు నడపాలని వినతి

**ఆమనగల్లు, మహా:** మాడుగుల మండలం నల్లచెరువు గ్రామం నుంచి మాడ్గుల మండల కేంద్రానికి వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల సమయంలో బస్సు నడపాలని బుధవారం కల్వకుర్తి ఆర్టీసీ అధికారులకు సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ లలిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు డిపో అధికారులను కలిసిన అనంతరం మాట్లాడుతూ.. పాఠశాల సమయానికి అరగంట ముందు అందుగుల బస్సు వెళ్తుందని దాని సమయాన్ని మార్చి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని కోరారు.



## నూతన రెస్టారెంట్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ పరిధిలోని రాల్లగూడ వెళ్లే రహదారిలో స్టార్టర్ బాక్స్ బిర్యానీ రెస్టారెంట్ ని బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. బిర్యాని ప్రియుల కోసం మంచి వంటకాలు రుచులతో కూడిన బిర్యానీని హోటల్ నిర్వాహకులు వడ్డిస్తారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పలు వురు నాయకులు హోటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ...

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్రాయిపల్లి గ్రామానికి చెందిన రాశులపల్లి కుమార్ ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానిక బిజెపి నాయకులు రాఘవెందర్ గౌడ్. రాశుల పల్లి కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీ ల బియ్యం అందజేశారు.. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, వింజమూరు నరసింహ,గడ్డం విజయ్,శేఖర్ ప్రజాపతి,సాదిక్ ఆలీ, చింతకాయల శ్రీను,ఆయిల్ ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## మార్కండేయ స్వామికి పూజలు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో బుధవారం మార్కండేయ జయంతిని పురస్కరించుకొని మార్కండేయ స్వామికి ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు పద్మశాలి సంఘం నాయకులు, పద్మశాలి కులస్తులతో కలిసి అర్చనలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మార్కండేయుడు చిన్న వయస్సులోనే మరణాన్ని జయించి, శివుడి అనుగ్రహంతో చిరంజీవిగా మారిన కథ అందరికీ స్ఫూర్తిదాయకం గుర్రం కేశవులు అన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. పూజా కార్యక్రమాలలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, చేనేత సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, మామిడిశెట్టి గోపాల్, గుద్దేటి మహేష్, పాత్రికేయులు మస్న ఆనంద్ కుమార్, ఏలె నిరంజన్, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## సనుగుల పాఠశాలను సందర్శించిన జిల్లా ప్యానెల్ టీమ్

**వేములవాడ,మహా:** చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా ప్యానెల్ టీమ్ సందర్శించింది.అన్ని తరగతులను పరిశీలించి విద్యార్థుల కనీస అభ్యసన స్థాయిలను పరీక్షించగా, పాఠశాల మౌళిక వసతులను కూడా సమీక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు భోదనోపకరణాలు, వర్క్‌షీట్లను వినియోగిస్తూ పాఠాలు బోధిస్తున్నారని, ఎఫ్ ఎల్ ఎస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారని గుర్తించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు రీమేడియల్ పరీక్షలు తీస్తున్నట్లు, లెస్సన్ ప్లాన్ మరియు హ్యాండ్‌బుక్ వినియోగిస్తూ ప్రత్యక్ష బోధన జరుగుతున్నట్లు ప్యానెల్ సభ్యులు తెలిపారు.ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్ మరియు ఉపాధ్యాయులను ఎం ఎన్ ఓ జలందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి లు కనుకయ్య, స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మేకల పద్మ, నాతరి నాగమణి, చింతల హరిష్మ, నవ్యలు పాల్గొన్నారు.

## మన బిడ్డల భవిష్యత్తే మన భవిష్యత్.. మన తెలంగాణ భవిష్యత్

### అన్నివర్గాల సంక్షేమమే ప్రధాన లక్ష్యం.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు

### మంత్రులతో కలిసి ధర్మపురిలో 263.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం






**కరీంనగర్ మహా :** తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, అన్నివర్గాల సంక్షేమంతో పాటుగా అన్ని వర్గాల అభివృద్ధికి మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి శ్రీకారం చుట్టారు. వీరితో పాటు ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్, ట్రైకార్ గిరిజన కార్పొరేషన్ చైర్మన్లు బెల్లయ్య నాయక్, తిరుపతి జగిత్యాల, పెద్దపల్లి, రామగుండం, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, విజయ రమణా రావు, మక్కాన్ సింగ్ ఠాగూర్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి రూ.200 కోట్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి రూ.10 కోట్లు, ఎస్టీపీ ప్లాంటు (శుద్ధ తాగు నీటి కేంద్రం) నిర్మాణానికి రూ.17 కోట్లు, ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణానికి రూ.2 కోట్లు, మొత్తంగా 263.40 కోట్ల అంచనాతో 19 అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ప్రసంగించారు. ధర్మపురి నియోజకవర్గంలో ఒక ఉమ్మడి కుటుంబం లాంటి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన చేశాము. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో, ఇంటర్నేషనల్ స్థాయిలో ఏ రకంగా విద్యాబోధనలు, వసతులు కల్పిస్తున్నారో అదేవిధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో అందిస్తామని తెలిపారు. ఒక్కో స్కూల్ కు 200 కోట్ల రూపాయలతో, దాదాపు 25 ఎకరాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే పేదల గురించి,బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచన చేస్తుందని, తమకు ప్రజలు ఈ అవకాశాన్ని ఇచ్చారని తెలిపారు. మన బిడ్డల భవిష్యత్తే మన భవిష్యత్తు, మన తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తు అని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో మొదటి సంవత్సరమే 200 కోట్లతో 100 స్కూళ్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. 22,500 కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందించి మొదటి సంవత్సరం నిధులు 11500 మంజూరు చేశామని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు ధర్మపురి నియోజకవర్గంలో భూమి పూజ చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతినెలా బిల్లులు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఒక గూడు లాగా ఉపయోగపడుతుందనీ, 5 లక్షల రూపాయలు ఇస్తే ఇండ్లు నిర్మించుకుని పేదవారు ఆత్మగౌరవం తో నివసిస్తారనే ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మొదటి సంవత్సరమే 4.50 లక్షల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. అదే విధంగా మహిళలందరు మహాలక్ష్మిలాగా చూస్తూ ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని తెలిపారు. ఖర్చుతో కూడుకున్న కట్టుకోడానికి ఉపయోగ పడే విధంగా నాణ్యమైన చీరలను ప్రతి ఒక్క మహిళకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యం, సంక్షేమ రంగాల అభివృద్ధికి సంకల్పబద్ధంగా పని చేస్తోందన్నారు. ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పిల్లలు చదువులో ముందుకు రావాలి, వారికి నాణ్యమైన వసతులు అందాలి అనే భావనతో ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. రైతు కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఎరువులు, విత్తనాలు, మద్దతు ధర, సాగునీటి సదుపాయాల కల్పన, మార్కెట్ లింకేజీ అన్న అంశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చూస్తోంది. అని పేర్కొన్నారు.

**గ్రామాలకు సేవ చేస్తే తల్లికి సేవ చేసినట్లే..**
**పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్ డబ్ల్యూఎస్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి..**

కరీంనగర్ మహా గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు అనీ,, గ్రామాలకు సేవ చేస్తే తల్లికి సేవ చేసినట్లేనని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్ డబ్ల్యూఎస్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు జగిత్యాల జిల్లా నూకపల్లి న్యాక్ సెంటర్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మూడు విడతలుగా 385 మంది సర్పంచ్ లకు శిక్షణ అందిస్తున్నామనీ, ఈ నెల 19 నుండి 23 వరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు మొదటి విడుత 122 మంది సర్పంచ్ లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇక్కడికి ఆహ్వానించినందుకు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కు అభినందనలు తెలిపారు. సర్పంచ్ లు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు, గుర్తించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. మనం శాశ్వతం కాదు, మన పదవులు శాశ్వతం కాదు, కానీ మనం చేసే పనులు ఎప్పటికీ శాశ్వతం అని ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తు ఉంటాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరుతాయనీ, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు, పన్నులు ముఖ్యంగా గ్రామాలను అభివృద్ధి పరచాలంటే పాలనాపరంగా ఏం కావాలో ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకోవచ్చన్నారు. మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే మన తల్లికి సేవ చేసినట్లే, మన గ్రామానికి మంచి పని చేస్తే గ్రామ ప్రజలు మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. అలాగే జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచే విధంగా మీరంత కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, జడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈవో పి. నరేష్, జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, డీడబ్ల్యూఓ బి. నరేష్, పంచాయతీ రాజ్ ఈఈ లక్ష్మణ్ రావు, శిక్షణ జిల్లా పంచాయతీ అధికారి, రేవంత్, ఎంపిడివోలు, ఎంపివోలు, టివోటిలు, సంబంధిత అధికారులు, డిపివో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కష్టార్జితంతో కొనుక్కున్న ప్లాట్లను కబ్జా చేసిన వ్యక్తుల నుండి తమ ప్లాట్లు తమకు ఇప్పించండి

**బాధితుడు నిమ్మ దివింజెధర్ రెడ్డి**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం చౌదర్ గూడ రెవెన్యూ పరిధిలోని 2005లో లక్ష్మీ మెగాసిటీ పేస్,2 పేరుతో వెంచర్ చేశారు. ఆ వెంచర్ లో నిమ్మ దివింజెధర్ రెడ్డి , ప్లాట్లు కొనుగోలు చేశారు. బుధవారం శంషాబాద్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వెంచర్ లోని తమ ప్లాట్లను కబ్జా చేసి ఇది తమ వ్యవసాయ భూమి అంటూ చౌదరిగూడ గ్రామానికి చెందిన మన్నె కరుణాకర్, మన్నె సుధాకర్ లు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. 2005లోనే వారికి ఉన్న పొలం అమ్ముకున్నారు. తాజాగా ఇప్పుడు వెంచర్ లో ఉన్న కాళీ పాట్లని కబ్జాకు పాల్పడుతున్నారు. మా ప్లాట్లను కబ్జా చేసి మమ్మల్ని ఇటు పక్కకు రావద్దంటూ బెదిరింపులకు దిగుతున్నాడని బాధితులు వాపోయారు. ప్లాట్లకు చుట్టూ వేసిన కడ్డీలను తొలగిస్తున్నారు. మీ ప్లాట్లు మీకు కావాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ప్లాట్లు కొన్న బాధితులు ప్లాట్లు డాక్యుమెంట్లు తీసుకొని పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. మీ వద్ద ఏమైనా పత్రాలు ఉంటే చూపించాలని కోరిన పత్రాలు లేకుండానే లక్ష్మీ మెగా సిటీలో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గతంలో వారిపై పలు కేసులు ఉన్నాయి. మా ప్లాట్ లను కబ్జా చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని బాధితులు కోరారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

**మొయినాబాద్ మహా:** తెలంగాణ ప్రభుత్వం రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా డ్రాయింగ్ పోటీలు నిర్వహించి పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతకు సంబంధించిన చిత్రాలను చిత్రించి తమ ప్రతిభను ప్రదర్శించారు. డ్రాయింగ్ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొయినాబాద్ ఇన్స్పెక్టర్ జీ.పవన్ కుమార్ రెడ్డి, సెక్టార్ ఎస్సై నయీముద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు.



ఈ సందర్భంగా మొయినాబాద్ ఇన్స్పెక్టర్ జీ. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై కరీంనగర్ జిల్లా నేతలకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం


**కరీంనగర్ మహా:** కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని మంత్రి తుమ్మల నేతలకు దిశా నిర్దేశం చేసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొన్నం ప్రభాకర్ లు నేతలకు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ , సిరిసిల్ల , వేములవాడ ,చొప్పదండి , హుస్నాబాద్ , హుజురాబాద్ , జమ్మికుంట మున్సిపాలిటీ లలో పార్టీ సమావేశాలు ఏర్పాటు, నేతల మధ్య సమన్వయం , ప్రభుత్వ పథకాలు ఇంటింటా ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,సిరిసిల్ల డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ,ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి




సత్యనారాయణ,ఆది శ్రీనివాస్, కరీంనగర్, సిద్దిపేట , సిరిసిల్ల జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు సత్తు మల్లేష్ , లింగమూర్తి , నాగుల సత్యనారాయణ గౌడ్ , సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ ఇంచార్జి ఒడితల ప్రణవ్ , సిరిసిల్ల ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి,కరీంనగర్, సిరిసిల్ల ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, సంగీతం శ్రీనాథ్ ,కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణను ప్రశంసించిన రాజస్థాన్ బృందం

**మహా:** కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును రాజస్థాన్ అధికారుల బృందం పరిశీలించి ప్రశంసించింది. రామడుగు మండలం వెలిచాల గ్రామంలో ఈ బృందం అధికారులు సందర్శించి అక్కడ చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరించడం, గ్రామస్తులు తడి పొడి చెత్తను వేరువేరుగా ఉంచి పారిశుద్ధ్య వాహనానికి అందించడం, సేకరించిన చెత్తతో ఎరువుల తయారీ విధానం తదితర అంశాలను ఈ బృందం అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను గురించి బృందం సభ్యులకు కలెక్టర్



వివరించారు. జిల్లాలో మల్టీపర్పస్ వర్కర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్న రక్షణ కవచాలు, బీమా సౌకర్యం తదితర విషయాలను గురించి సభ్యులతో చర్చించారు. రాజస్థాన్ బృందం సభ్యుల్లో స్వచ్ఛభారత్ మిషన్ రాజస్థాన్ డైరెక్టర్ సాలోని కెంకా, గంగానగర్ జెడ్పీ సీఈవో గిరిధర్, బర్మార్ జెడ్పి సీఈవో రవికుమార్, ఎస్ బి ఎం బ్యాంక్ డైరెక్టర్ మురళి లాల్ శర్మ, ఈఈ రాజేష్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డి ఓ శ్రీధర్, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పరకాలలో గులాబీ జెండా ఎగరడం ఖాయం..

**చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

**పరకాల మహా:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పరకాల పట్టణంలోని 4వ, 16వ వార్డులకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ విధానాలపై తీవ్ర అసంతృప్తితో తమ పదవులకు రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గారు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, "ప్రజల సమస్యలపై పోరాటం చేయలేని కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీలో చేరడం అభినందనీయం. బిఆర్ఎస్ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. పరకాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు.

## వనదేవత లను దర్శించుకున్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు


**వరంగల్ మహా;** ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర ఆదివాసీల ఆరాధ్య వనదేవతలయిన సమ్మక్క, సారలమ్మలను మేడారం జాతర సందర్భంగా బుధవారం బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు బంగారంతో పాటు పూలమాలలు సమర్పించి, రాష్ట్ర ప్రజల క్షేమం, ఆర్థిక సమృద్ధి, సుఖసంతోషాల కోసం ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ప్రదీప్ రావు మాట్లాడుతూ, సమ్మక్క-సారలమ్మ జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన ఈ



మహోత్సవం తెలంగాణకు ప్రత్యేక గర్వకారణమని అన్నారు. గిరిజనుల ఆరాధ్య వనదేవతల ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రదీప్ రావు బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి ఆరోపణలపై కమీషనర్ ఆరా



- **దస్త్రాలు పెండింగ్‌లో ఉండకుండా గడువులోగా పరిష్కరించాలి**
- **బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** ఇటీవల పత్రికలు, ప్రచారమాధ్యమాలలో టౌన్ ప్లానింగ్ విభాగం పై ప్రత్యేక కథనాలతో కూడిన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులు సిబ్బంది పై వస్తున్నా ఆరోపణల పై కమిషనర్ క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. అవినీతి ఆరోపణల్లో వాస్తవం ఎంత ? ఎవరు ఎంత అవినీతికి పాల్పడుతున్నారు? అనే కోణంలో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా లేఔట్లు, కమర్షియల్ భవనాలకు, నివాసాలకు బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పట్టణ ప్రణాళిక విభాగంలో దస్త్రాలు పెండింగ్‌లో ఉండకుండా, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అన్ని దరఖాస్తులు, వినతులు పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యంగా ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కారము, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా గృహ నిర్మాణాలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన, లేఅవుట్ అనుమతులు, భవన అనుమతులు, రెగ్యులరైజేషన్ దరఖాస్తులు తదితర అంశాలపై కమిషనర్ సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రణాళిక విభాగం సేవలు ప్రజలకు నేరుగా సంబంధించినవని, చిన్న ఆలస్యం కూడా ప్రజలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రతి దరఖాస్తును బాధ్యతతో, పారదర్శకంగా, వేగంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిని ప్రాధాన్యతతో తీసుకొని, నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి, పరిష్కార వివరాలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా గృహ నిర్మాణాలకు వచ్చిన దరఖాస్తుల విషయంలో, అవసరమైన ఫీల్డ్ తనిఖీలు సకాలంలో పూర్తిచేసి, సాంకేతిక అంశాల్లో అనవసర ఆలస్యం లేకుండా అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. దస్త్రాలు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో పని చేసే అధికారులు సమన్వయంతో పనిచేసి, ఫైళ్ల కదలికపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఫైల్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని సూచించారు.

## పోలీసులకు మానసిక ప్రశాంతత కోసం శౌర్య' ఇండోర్ గేమ్స్ హాల్..

### ఎక్కడలేని విధంగా కరీంనగర్‌లో సీపీ ప్రత్యేక చొరవతో ఏర్పాటు..

**కరీంనగర్, మహా :** పోలీస్ అధికారులు సిబ్బంది సంక్షేమంలో భాగంగా, వారి మానసిక ఉల్లాసం కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 'శౌర్య' ఇండోర్ గేమ్స్ హాల్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అధికారికంగా ప్రారంభించారు. ఎల్లప్పుడు బిజీగా ఉండే పోలీసులకు కాస్త మానసికోల్లాసం.. ప్రశాంతత కోసం వినూత్నంగా సీపీ ఏర్పాటు చేయించారు. కమిషనరేట్ లోని అస్త్ర కన్వెన్షన్ హాలు పక్కన గతంలో వాడుకలో లేని పాత యూనిట్ హాస్పిటల్ భవనాన్ని సీపీ ప్రత్యేక చొరవతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. దీనికి 'శౌర్య ఇండోర్ గేమ్స్ హాల్' అని నామకరణం చేసి, సిబ్బందికి అన్ని రకాల క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా పునర్నిర్మించారు. ఈ క్రీడా వేదికలో అధికారులు సిబ్బంది కోసం అనేక వసతులను ఏర్పాటు చేశారు. టేబుల్ టెన్నిస్.. స్నూకర్స్, క్యారం బోర్డ్స్ మసాజ్ చైర్ (విశ్రాంతి కోసం), టీవీ హాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈ ఇండోర్ గేమ్స్ హాల్ హోమ్ గార్డ్ స్థాయి నుంచి కమిషనర్ వరకు అందరికీ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. నిరంతరం విధులతో బిజీగా ఉండే పోలీసులు తమ మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని, తద్వారా వారు మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. Aపోలీసుల ఆరోగ్యం మానసికోల్లాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినందుకు కమిషనరేట్ సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు కరీంనగర్ కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**ఎనుమాముల పోలీసు ఇన్స్పెక్టర్ జె సురేష్**

**వరంగల్ మహా;** జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవాల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, మీడియా ఔట్రిచ్ సందర్భంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం ఎనుమాముల ఇన్స్పెక్టర్ జె సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ముఖ్యంగా ఓవర్ స్పీడ్, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం, మద్యం మత్తులో వాహనం నడపడం, అజాగ్రత్తగా వాహనం నడపడం, సెల్ఫోన్ డ్రైవింగ్ వంటి అంశాల పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.



# బిట్ కాయిన్...

## డిజిటల్ కాయిన్లుగా గోవులు

- ఎన్ఎఫ్టీల ద్వారా ఇన్వెస్టర్లు కొనుక్కోవచ్చు
- మెయింటెనెన్స్ బాదరబందీ లేదు
- డివిడెండ్‌గా నెలకు రెండు లీటర్ల నెయ్యి
- స్టార్టప్ 'గోమిని' వినూత్న వ్యాపారం




అంతా డిజిటల్‌మయంగా మారుతున్న నేపథ్యంలో పాడి వ్యాపారం కూడా డిజిటల్ బాట పడుతోంది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా సరే మనం ఆవుల్ని డిజిటల్‌గా కొనుక్కుని, మెయింటెనెన్స్ బాదరబందీ లేకుండా, రాబడిని అందుకునే విధంగా గోమిని అనే ఓ స్టార్టప్ సంస్థ వినూత్న వ్యాపారాన్ని తెరపైకి తెచ్చింది. బిహార్‌కి చెందిన ఈ స్టార్టప్‌ని అర్జున్ శర్మ అనే ఔత్సాహిక వ్యాపారవేత్త ప్రారంభించారు. మేలుజాతి దేశీ ఆవుల క్లస్టర్లను ఏర్పాటు చేశారు.
మోడర్న్ టెక్నాలజీతో ఒక్కో ఆవుకి ఎన్ఎఫ్టీ (నాన్-ఫంజిబుల్ టోకెన్)ని సృష్టించి, వాటిని విక్రయిస్తున్నారు. దీనితో అమెరికా, కెనడా, లండన్ ఎక్కున్నుంచైనా సరే ఇన్వెస్టర్లు ఎన్ఎఫ్టీలను కొనుక్కోవడం ద్వారా సదరు ఆవులను సొంతం చేసుకోవచ్చు. ఇలా అమ్మిన ఆవుల పోషణ భారాన్ని ఇన్వెస్టర్ల తరఫున ఇక్కడే గోమిని చూసుకుంటుంది. అంతేకాదు వారికి పెట్టుబడి మీద రాబడి కింద ప్రతి నెలా డివిడెండ్ మాదిరి రెండు కిలోల స్వచ్ఛమైన నెయ్యిని కూడా పంపిస్తుంది. అది కూడా వారు కొనుక్కున్న ఆవు ఇచ్చిన పాల నుంచి తీసినదే అయి ఉంటుంది.

**రైతుకు కూడా ప్రయోజనం ..**


కేవలం ఇన్వెస్టర్ల కోణంలోనే కాకుండా రైతులకు కూడా ప్రయోజనకరంగా ఉండే విధంగా ఈ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు శర్మ తెలిపారు. ఫార్మ్‌లను నిర్వహించడం ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి లభిస్తుందని వివరించారు. తద్వారా ఇటు గోమాతకి అటు మహిళల ఉపాధికి కూడా తోడ్పాటు అందించినట్లవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం వివిధ రకాల ప్లాన్లు కూడా ప్రవేశపెట్టారు. రూ. 3,97,000 నుంచి కొనుగోలు చేయొచ్చు లేదా ముందుగా రూ. 30,000 బుకింగ్ కింద కట్టి ప్రతి నెలా ఈఎంఐ కింద ఓ 24 నెలలు రూ. 17,500 కట్టేలా కూడా ప్లాన్లను గోమిని అందిస్తోంది. కేవలం నెయ్యితో సరిపెట్టకుండా ఆవు పేడను కూడా మానిటైజ్ చేసే పనిలో ఉన్నారు అర్జున్ శర్మ. ఒక్క కేజీ పొడి ఆవు పేడతో అగరొత్తుల్లో ఉపయోగించే 1.4 కేజీ పొడిని తయారు చేయొచ్చని, దీనికి మరింత ఎక్కువ విలువ లభిస్తుందని ఆయన చెప్పారు.

### రూ. 15 లక్షల వరకు రాబడి

ప్రయోజనాలు ఇక్కడితో ఆగిపోవు. సదరు ఆవు సంతతి పెరిగే కొద్దీ మరింత ఆదాయాన్ని కూడా ఇన్వెస్టరు పొందవచ్చు. పాలు, పిడకలు, అగరొత్తులు ఇత రత్రా ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 25% రాబడిని అందుకోవచ్చు. మొత్తం మీద కాస్తంత ఇన్వెస్ట్ చేస్తే ఓ ఆవును, దాని జీవితకాలంలో రూ. 15 లక్షలకు పైగా రాబడులు అందుకోవచ్చని శర్మ వివరించారు. సరే, దీనికి ఎన్ఎఫ్టీలాంటి సంక్లిష్టమైన టెక్నాలజీ హంగులు ఎందుకంటే, కొనుగోలు, ఆ తర్వాత జరిగే ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత కోసం అంటారు అర్జున్ శర్మ. ఈ విధానంలో సిసలైన యజమానిని ధ్రువీకరించే డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. ఇందులో ఆవు జాతి, వయస్సు, విశిష్ట గుర్తింపు, లొకేషన్, ఆరోగ్యం వివరాలు, రెవెన్యూ షేరింగ్ ఒప్పందం వివరాలు మొదలైనవన్నీ ఉంటాయి. ప్రస్తుతం బిహార్‌లో కంపెనీకి మూడు క్లస్టర్లు ఉన్నాయి. గో సేవను కేవలం చా రిటీకి పరిమితం చేయకుండా రాబడినిచ్చే లాభ సాటి పెట్టుబడి మార్గంగా మార్చడం వల్ల గో సంరక్షణ వైపు మరింత మంది ఇన్వెస్టర్లను మళ్లించవచ్చనేది అర్జున్ శర్మ ఆలోచన. తద్వారా అంతరించిపోతున్న మేలిమిజాతి దేశీ ఆవులను సంరక్షించవచ్చని ఆయన తెలిపారు. ఈ వినూత్న ప్రయత్నానికి నాబార్డ్ కూడా తోడ్పాటు అందిస్తోంది.

# డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు

### క్యూ3లో 14 శాతం తగ్గుదల ..
### రూ. 8,727 కోట్లకు ఆదాయం అప్




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ నికర లాభం రూ. 1,210 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో నమోదైన రూ. 1,413 కోట్లతో పోలిస్తే 14 శాతం తగ్గింది. ఆదాయం రూ. 8,357 కోట్ల నుంచి రూ. 8,727 కోట్లకు చేరింది. కీలకమైన అమెరికా మార్కెట్లో లెనాలిడోమైడ్ విక్రయాలు నెమ్మదించడం, నిర్దిష్ట ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గడం, కొత్త లేబర్ కోడ్‌ల అమలుకు సంబంధించి వన్-టైమ్ ప్రొవిజన్ చేయాల్సి రావడం వంటి అంశాలు ప్రభావం చూపినట్లు బుధవారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సంస్థ తెలిపింది. బ్రాండెడ్ వ్యాపారాలు మెరుగ్గా రాణించడం, ఫారెక్స్‌పరమైన సానుకూల ప్రయోజనాల వల్ల ఆ లోటు భర్తీ అయినట్లు కంపెనీ కో-చైర్మన్ జి.వి. ప్రసాద్ తెలిపారు. ప్రధాన వ్యాపార వృద్ధి, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం మొదలైన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, వ్యాపార భాగస్వాములకు దీర్ఘకాలికంగా మరింత విలువను చేకూర్చడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఆయన వివరించారు.

**మరిన్ని ముఖ్యాంశాలు..**

గ్లోబల్ జనరిక్స్ విభాగం నుంచి ఆదాయం 7 శాతం పెరిగి సుమారు రూ. 7,375 కోట్ల నుంచి రూ. 7,911 కోట్లకు పెరిగింది. కీలకమైన ఉత్తర అమెరికాలో ఆదాయం రూ. 3,383 కోట్ల నుంచి రూ. 2,964 కోట్లకు తగ్గింది. యూరప్ విక్రయాలు 1,209 కోట్ల నుంచి 20 శాతం వృద్ధి చెంది రూ. 1,447 కోట్లకు పెరిగాయి. ఇక భారత మార్కెట్లో అమ్మకాలు 19 శాతం వృద్ధితో రూ. 1,346 కోట్ల నుంచి రూ. 1,603 కోట్లకు చేరాయి. వర్ధమాన మార్కెట్లలో ఆదాయం సుమారు రూ. 1,436 కోట్ల నుంచి రూ. 1,896 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో అమెరికా మార్కెట్లో 6, యూరప్‌లో 10, భారత్‌లో రెండు, వర్ధమాన మార్కెట్లలో 30 కొత్త ఉత్పత్తులను కంపెనీ ప్రవేశపెట్టింది. భారత మార్కెట్లో కొత్త బ్రాండ్‌లను ఆవిష్కరించడం, ధరల పెరుగుదల, అధిక అమ్మకాలు మొదలైన అంశాలు మెరుగైన ఫలితాలకు దోహదపడ్డాయి. ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియెంట్స్ (పీఎస్ఏఐ) విభాగం ఆదాయం రూ. 822 కోట్ల నుంచి 2% క్షీణించి రూ. 802 కోట్లకు తగ్గింది.



## డేంజర్‌లో వైట్ కాలర్ జాబ్స్..
### బిల్‌గేట్స్

ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శరవేగంగా విస్తరిస్తోంది. ఈ కృత్రిమ మేధ (AI) నేడు ప్రతి రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేస్తోంది. అయితే ఈ ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడనున్నాయని మైక్రోసాఫ్ట్ ఫౌండర్ బిల్‌గేట్స్ హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రాబోయే నాలుగైదు ఏళ్లలో అటు వైట్ కాలర్, ఇటు బ్లూ కాలర్ ఉద్యోగ రంగాల్లో ఏఐ ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఈ అసమానతల సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. న్యూ స్కిల్‌స్‌ను నేర్పించడం లేదా పన్ను వ్యవస్థలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఇప్పటివరకు ఏఐ ప్రభావం తక్కువగానే ఉన్నప్పటికి.. భవిష్యత్తులో ఎక్కువగా మార్పులు కనిపిస్తాయి. ఇప్పటికే ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, లాజిస్టిక్స్, కాల్ సెంటర్లలో లోయర్ స్కిల్ ఉద్యోగాలను భర్తీ చేసింది. ఈ సమస్యలను పరిష్కరించకోకపోతే సంపద, అవకాశాలు కొద్దిమంది చేతుల్లోకి మాత్రమే వెళ్లిపోతాయి. దీంతో సమాజంలో అసమానతలు పెరిగే అవకాశముంది" అని బిల్‌గేట్స్ పేర్కొన్నారు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## రష్యా నుంచి భారత్ చమురు కొనట్లేదు




### అమెరికా ప్రకటన


**దావోస్:** రష్యా నుంచి ముడి చమురును కొనే దేశాలపై తాము 25 శాతం అదనపు టారిఫ్‌ను విధించడం మొదలెట్టాక రష్యా నుంచి భారత్ క్రూడ్‌ఆయిల్ కొనుగోళ్లు ఆగిపోయాయని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బీసెంట్ ప్రకటించారు. డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు చేరుకున్న బీసెంట్ అక్కడ ఫాక్స్ బిజినెస్ వార్తాసంస్థతో మాట్లాడారు. " ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలయ్యాకే రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఇటీవల మేం పాతికశాతం అదనపు టారిఫ్ విధించడంతో తాజాగా ఆ కొనుగోళ్లు ఆగిపోయాయి. ఇంకా చమురు కొని ఇతర దేశాలకు తిరిగి విక్రయిస్తున్న దేశాలపై 500 శాతం టారిఫ్ వేయాలనే బిల్లును సెనేటర్ లిండ్సే గ్రాహమ్ సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు ఆమోదం పొందుతుందో లేదో వేచిచూడాలి. రష్యా చమురును యూరప్ దేశాలు కొంటే రష్యాకు ఆర్థిక లాభాల పంట పండిస్తున్నాయి. ఇలా పరోక్షంగా యూరప్ దేశాలు తమపైనే రష్యా యుద్ధానికి ఆర్థికసాయం చేస్తున్నాయి'' అని బీసెంట్ అన్నారు.

### మోదీ నాకు మంచి మిత్రుడు..
## త్వరలో బిగ్ ట్రేడ్ డీల్: ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (WEF) 2026 సదస్సులో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత్‌అమెరికా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తనకు మంచి స్నేహితుడని, ఇరు దేశాల మధ్య త్వరలోనే ఒక భారీ ట్రేడ్ డీల్ కుదరబోతుందని ఆయన అన్నారు. ఈ ప్రపంచ ఆర్థిక సదస్సులో తన ప్రసంగం ముగిసిన తర్వాత భారత్‌కు చెందిన 'మనీకంట్రోల్' వార్తా సంస్థతో ట్రంప్ మాట్లాడారు. "మీ ప్రధానమంత్రిపై నాకు అపారమైన గౌరవం ఉంది. ఆయన ఒక అద్భుతమైన వ్యక్తి. నాకు మంచి మిత్రుడు. త్వరలో భారీ ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నాము" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా భారత్‌యూఎస్ బీటీఏ ఒప్పందం మొదట దశకు చాలా దగ్గరగా ఉందని భారత వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ ఇటీవల స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ట్రేడ్ డీల్ గురుంచి ట్రంప్ కూడా వ్యాఖ్యలు చేయడం ప్రధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం భారత్‌అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం $191 (సుమారు ₹15.8 లక్షల కోట్లు) బిలియన్లుగా ఉంది. అయితే ఈ కొత్త డీల్ ద్వారా 2030 నాటికి దీనిని $500 బిలియన్లకు (సుమారు ₹41 లక్షల కోట్లు) చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్‌కు ప్రస్తుతం అమెరికానే అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. భారత్ మొత్తం ఎగుమతుల్లో సుమారు 18 శాతం వాటా అమెరికాదే. అయితే రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై 25 శాతం నుంచి 50 శాతం వరకు అదనపు సుంకాలను ట్రంప్ ప్రభుత్వం విధించింది. దీంతో భారత ఎగుమతులు సుమారు 8.5 శాతం తగ్గాయి. అయితే దావోస్ సదస్సులో భారత్‌పై ట్రంప్ సానుకూల వ్యాఖ్యలు చేయడంతో ఈ సుంకాలు తగ్గే అవకాశముంది.

### అమెరికాలో తీవ్ర రూపం దాల్చిన 'మీజిల్స్'..
## ఆందోళనలో ప్రజలు



అమెరికాలోని దక్షిణ కరోలినా రాష్ట్రంలో మీజిల్స్( తట్టు) వ్యాధి తీవ్ర రూపం దాల్చింది. గత నాలుగు రోజుల్లోనే 88 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 646కు చేరింది. కేసులు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా క్లెమ్సన్,ఆండర్సన్ విశ్వవిద్యాలయాలకు కూడా ఈ వైరస్ పాకింది. ఈ యూనివర్సిటీల్లో చాలా మంది విద్యార్థులు ఐసోలేషన్‌లో ఉన్నారు. కాగా ఈ వ్యాధి తీవ్రత వాయువ్య ప్రాంతంలోని ఎక్కువగా స్పార్టన్‌బర్గ్ (Spartanburg) పట్టణంలో ఎక్కువగా ఉంది. వ్యాధి సోకిన వారిలో ఎక్కువమంది టీకా తీసుకోని వారే కావడం గమనార్హం. ఈ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గాలి ద్వారా అత్యంత వేగంగా వ్యాపించే ఈ వైరస్ వల్ల నిమోనియా, మెదడు వాపు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

**ప్రమాదంలో అమెరికా హోదా..**

కాగా 2000 సంవత్సరంలో అమెరికా మీజిల్స్ రహిత దేశంగా ప్రకటించబడింది. అయితే ఇప్పుడు కేసులు అధికంగా పెరుగుతుండడంతో అమెరికా తన "మీజిల్స్ రహిత" హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే యూటా, అరిజోనా, ఉత్తర కరోలినా వంటి రాష్ట్రాల్లో కూడా మీజిల్స్ కేసులు నమోదవుతున్నాయి.

## ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్'లో చేరేందుకు నో చెప్పిన చైనా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షాకిచ్చింది. గాజా పునర్నిర్మాణం, అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం ట్రంప్ ప్రతిపాదించిన "బోర్డ్ ఆఫ్ పీస్"లో చేరేందుకు చైనా నిరాకరించింది. ఐక్యరాజ్య సమితికి సంబంధం లేని ఏ వ్యవస్థలోనూ చేరే ఉద్దేశం తమకు లేదని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేశారు. "ప్రపంచ పరిస్థితులు ఎలా మారినా చైనా మాత్రం ఐరాస చట్టాలకు, అంతర్జాతీయ నిబంధనలకే కట్టుబడి ఉంటుంది అని ఆయన పేర్కొన్నారు. ఈ 'బోర్డ్ ఆఫ్ పీస్' ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా మార్చాలనే వ్యూహంతో ట్రంప్ ముందుకెళ్తున్నారు. అయితే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న చైనా.. ట్రంప్ శాంతి మండలి విజయవంతమైతే తమకు ప్రాధాన్యత తగ్గిపోతుందని భయపడుతోంది. ఈ క్రమంలోనే ట్రంప్ ఆహ్వానాన్ని చైనా తిరస్కరించింది. కాగా ట్రంప్ శాంతి మండలికి యూరప్ నుంచి కూడా ఊహించని వ్యతిరేకత ఎదురవుతోంది. ఇప్పటికే ఫ్రాన్స్, నార్వే, స్వీడన్ వంటి దేశాలు ట్రంప్ శాంతి మండలిలో చేరబోమని స్పష్టం చేశాయి. తాజాగా ఇటలీ కూడా తమ దేశ రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఈ మండలిలో చేరలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి 20 దేశాలు ఈ మండలిలో చేరేందుకు అంగీకరించినట్లు అమెరికా ప్రకటించింది. ఇజ్రాయెల్ కూడా ఈ బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరింది. తొలుత టర్కీ, ఖతార్ వంటి దేశాలకు చోటు కల్పించడంపై అభ్యంతరాలు ఇజ్రాయెల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ట్రంప్ పంపిన ఆహ్వానాన్ని గౌరవిస్తూ ఈ పీస్ బోర్డులో చేరాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నిర్ణయించుకున్నారు. ఈ బోర్డులో భాగస్వామి కావడానికి పాకిస్తాన్ కూడా సుముఖత వ్యక్తం చేసింది. అయితే భారత్‌కు కూడా ఈ శాంతి మండలిలో చేరాలని ఆహ్వానం అందింది. కానీ దీనిపై భారత ప్రభుత్వం ఇంకా ఎటువంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదు.

## మాజీ ప్రధానికి 23 ఏళ్ల జైలు శిక్ష



**సియోల్:** దక్షిణ కొరియా మాజీ ప్రధాని హాన్ డక్‌సూకి సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు బుధవారం 23 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దేశంలో అశాంతిని సృష్టించి, విఫలమైన 'మార్షల్ లా' (సైనిక పాలన) కేసులో ఆయను దోషిగా తేలుస్తూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. 76 ఏళ్ల హాన్ డక్‌సూ.. క్యాబినెట్ సమావేశంలో అధ్యక్షుడి మార్షల్ లా ఆదేశాలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నించారని కోర్టు నిర్ధారించింది. అయితే తాను మార్షల్ లాను వ్యతిరేకించానని హాన్ కోర్టులో చెప్పినప్పటికి.. ఆయన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. కాగా ఈ తీర్పుపై ఆయన పైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది.

**అసలేమి జరిగిదంటే?**

దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబర్ లో దక్షిణా కొరియోలో అప్పటి దేశ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఎమర్జెన్సీ మార్షల్ లా(సైనిక పాలన) పాలన విధించారు. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి .ఆ దేశ పార్లమెంటును సైన్యం చుట్టుముట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఎమర్జెన్సీ మార్షల్ లా అమలును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం తీసుకురాగా పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో యూన్ అభిశంసన వేటుకు గురయ్యారు. ఇప్పటికే ఈ కేసులో యూన్ సుక్ యోల్‌కు న్యాయస్థానం 5 సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

## 300కు పైగా జర్నలిస్టుల అరెస్టులు

2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల అరెస్టులపై కమిటీ టూ ప్రొటెక్ట్ జర్నలిస్ట్ (CPJ) నివేదిక వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 2025 డిసెంబర్‌లో అరెస్టైన జర్నలిస్టుల సంఖ్య 300కు పైగా ఉన్నట్లు పేర్కొంది. దీనిలో అత్యధికంగా చైనా 50 మంది పాత్రికేయులను బంధించినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పాత్రికేయుల అక్రమ నిర్బంధాలు ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. 300సంఖ్య దాటి అరెస్టులు జరగడం ఇది వరుసగా ఐదవ సారని CPJ నివేదిక పేర్కొంది. పాత్రికేయుల అరెస్టులలో చైనా అధికంగా 50, మయన్మార్ 30, ఇజ్రాయెల్ 29 అరెస్టులు ఉన్నట్లు తెలిపింది. రష్యా 27, బెలారస్ 25, అజర్‌బైజాన్ 24 తరువాతి స్థానాలలో ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకూ జర్నలిస్టులు అధికంగా 1992 సంవత్సరంలో 384 మంది అరెస్టు కాగా ప్రస్తుతం 2025 మూడవ అత్యధిక అరెస్టులు జరిగిన సంవత్సరమని CPJ తెలిపింది. అయితే అరైస్టైన జర్నలిస్టులలో దాదాపు సగంమందికి పైగా ఎటువంటి నేరం చేయకుండానే అక్రమంగా నిర్భందించినట్లు న్యూయార్క్‌కు చెందిన ఒక ఎన్జీవో సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది. అంతేకాకుండా జైలులో 20 శాతం తీవ్రమైన హింసను ఎదుర్కొంటున్నారని పేర్కొంది.

# 20 ఏళ్ల ఏజ్ గ్యాప్..

## తొలిసారి పెదవి విప్పిన హీరోయిన్



'నాన్న', 'పొన్నియన్ సెల్వన్' సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించిన సారా అర్జున్ 'ధురంధర్' సినిమాతో హీరోయిన్‌గా మారింది. తొలి సినిమాకే ఇండస్ట్రీ హిట్ కొట్టింది. ఇందులో 40 ఏళ్ల హీరో రణ్‌వీర్ సింగ్‌కు జంటగా నటించింది 20 ఏళ్ల సారా. దీంతో హీరోహీరోయిన్ల ఏజ్ గ్యాప్ గురించి చాలా విమర్శలు వచ్చాయి. ఈ ట్రోలింగ్‌పై తొలిసారి పెదవి విప్పింది సారా అర్జున్.

**అదే నమ్ముతా..**

ఆమె మాట్లాడుతూ.. నేను సామాజిక మాధ్యమాల్లో చురుకుగా లేను. కాబట్టి అక్కడేం జరుగుతుందనేది నాకు పెద్దగా తెలీదు. ఈ ఏజ్ గ్యాప్ గొడవంతా సోషల్ మీడియాలోనే జరుగుతోందనుకుంటా.. అయినా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అభిప్రాయం ఉంటుందని భావిస్తాను. ఎవరి జీవితం వాళ్లది అనే సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతాను. కాబట్టి ఏజ్ గ్యాప్ నచ్చకపోవడమనేది వారి సమస్య. అది నన్ను ఏమాత్రం ప్రభావితం చేయదు. అలాంటివి నేను లెక్క చేయను. సినిమా కథేంటో నాకు తెలుసు. ఆ కథకు అనుగుణంగానే అందరూ నడుచుకున్నారు. అంతే..

**కో స్టార్‌పై ప్రశంసలు**

ఇకపోతే రణ్‌వీర్ సింగ్ లాంటి నటులను నేను చూడలేదు. ఎంతో అంకితభావంతో పని చేస్తాడు. సెట్‌లో ఉన్న అందరి గురించి పట్టించుకుంటాడు. సినిమా తీయడం అనేది దర్శకనిర్మాతల పని మాత్రమే కాదు.. సమిష్టి కృషి అని నమ్ముతాడు. సెట్ డిజైన్ దగ్గరి నుంచి అన్నింట్లోనూ పాలుపంచుకుంటాడు. అందర్నీ ఏకం చేసి ముందుకు నడిపిస్తాడు అంటూ హీరోపై ప్రశంసలు కురిపించింది.

**సినిమా**

ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ధురంధర్ సినిమా 2025 డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బ్లాక్‌బస్టర్ టాక్‌తో ఇప్పటికీ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ జంటగా నటించిన ఈ మూవీలో అక్షయ్ ఖన్నా, ఆర్ మాధవన్ కీలక పాత్రలు పోషించారు. బాక్సాఫీస్ వద్ద ఇప్పటివరకు ఈ చిత్రం రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది.

# 14 ఏళ్లకే మద్యం.. ఇప్పుడు గ్రీన్ టీతో పార్టీలు

## : నిధి అగర్వాల్

సినీ ఇండస్ట్రీలో తన అందం, నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి నిధి అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను ఇటీవల వెల్లడించింది. చిన్న వయసులోనే మద్యం సేవించడం ప్రారంభించినప్పటికీ, ఆ అలవాటును పూర్తిగా విడిచిపెట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎంచుకున్నట్లు ఆమె తెలిపింది. నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. తాను 14 ఏళ్ల వయసులోనే తొలిసారి మద్యం సేవించాను. ఆ సమయంలో ఫ్రెండ్స్ తో కలిసి తాగడం సరదాగా అనిపించేది. అప్పట్లో అది ఫన్‌గా అనిపించింది. కానీ కాలక్రమేణా మద్యం నాకు సరిపడదని అర్థమైంది. తాగిన తర్వాత తనకు అసౌకర్యంగా, కొన్నిసార్లు భయంగా కూడా అనిపించేది. ఆ అనుభవాలే నన్ను ఆలోచనలో పడేశాయి. చివరకు మద్యం పూర్తిగా మానేయాలనే నిర్ణయం తీసుకున్నాను. నేను చివరిసారి మద్యం తాగి దాదాపు ఆరేళ్లు పూర్తయింది. ఆల్కహాల్ ఆరోగ్యానికి మంచిది కాదని ఆలస్యంగా అయినా గ్రహించాను. నా శరీరం కూడా ఆల్కహాల్‌ను అంగీకరించడం లేదని అర్థమైంది. అందుకే వెంటనే మానేశాను. ప్రస్తుతం పార్టీలకు వెళ్లినప్పటికీ మద్యం జోలికి మాత్రం వెళ్లడం లేదు. అయితే దాని బదులు గ్రీన్ టీతో ఎంజాయ్ చేస్తున్నాను. నా ఫ్రెండ్స్‌లో కొంతమంది ఆల్కహాల్ తాగుతారు. కానీ నేను మాత్రం తాగను. మద్యం లేకుండానే పార్టీల్లో బాగా ఎంజాయ్ చేయొచ్చని నిధి స్పష్టం చేసింది.



# 'బాహుబలి' తర్వాత ప్రభాస్ ఎందుకిలా చేస్తున్నాడు?



ఏ హీరో.. ఏ దర్శకుడు.. ఏ నిర్మాత కూడా ఫ్లాప్ సినిమాని తీయాలనుకోరు. కొన్నిసార్లు అనుకోకుండా అలా జరిగిపోతుంటాయి. కొన్నిసార్లు మాత్రం కాంబినేషన్ ప్రకటించినప్పుడే సందేహాలు వస్తుంటాయి. తీరా థియేటర్లలోకి వచ్చిన తర్వాత అవి నిజమవుతుంటాయి. రీసెంట్ టైంలో 'రాజాసాబ్' ఓ ఉదాహరణ. ప్రభాస్ విషయంలో పలుమార్లు ఇలాంటి అనుభవాలు ఎదురయ్యాయి. ఇంతకీ అసలేం జరుగుతోంది? ప్రభాస్ ఏం చేస్తున్నాడు? 'బాహుబలి' ముందు వరకు ప్రభాస్ ఓ సాధారణ హీరోనే. చెప్పుకోవడానికి కొన్ని హిట్స్ ఉన్నాయి. ఎప్పుడైతే రాజమౌళితో ఈ మూవీ చేశాడో.. దేశవ్యాప్తంగా అద్భుతమైన క్రేజ్ సొంతం చేసుకున్నాడు. అయితే దీన్ని నిలబెట్టుకునే క్రమంలో చాలా పకడ్బందీగా ప్లాన్ చేసుకోవాల్సింది. తెలిసో తెలియకో ప్రభాస్ కొన్ని తప్పటడుగులు వేశాడు, ఇప్పటికీ వేస్తున్నాడా అనే సందేహం కలుగుతోంది. ఎందుకంటే పాన్ ఇండియా క్రేజ్ వచ్చిన తర్వాత ఏ హీరో అయినా సరే తనకు సూట్ అయ్యే దర్శకుల్ని, స్టోరీల్ని ఎంచుకుని సినిమాలు చేయాలి. అప్పుడు రేంజ్ పెరిగేందుకు అవకాశముంటుంది. క్రేజ్ ఉంది కదా అని తొందరపడకూడదు. ప్రభాస్ కూడా ఇలానే స్టార్ హీరోలతో పనిచేసిన అనుభవం లేని కొందరు మిడ్ రేంజ్ దర్శకులకు అవకాశాలిచ్చి తన విలువైన కాలాన్ని వృథా చేసుకున్నాడా అనిపిస్తుంది!

'బాహుబలి' తర్వాత ఒకేఒక్క సినిమా తీసిన సుజీత్‌కి ప్రభాస్ అవకాశమిచ్చాడు. మూవీకి కలెక్షన్స్ బాగానే వచ్చినప్పటికీ ఎందుకో ఆడియెన్స్‌కి మూవీ పూర్తిస్థాయిలో నచ్చలేదు. దీంతో యావరేజ్ మార్క్ దగ్గర ఆగిపోయింది. తర్వాత వచ్చిన 'రాధేశ్యామ్' అయితే డార్లింగ్ ఫ్యాన్స్‌కి పీడకలగా మిగిలిపోయింది. ప్రభాస్ లాంటి నటుడిని పెట్టుకుని ఇలాంటి సినిమానా తీసేది అని దర్శకుడు రాధాకృష్ణని విమర్శించని వాళ్లు లేరు. తర్వాత వచ్చిన 'ఆదిపురుష్' అయితే ఇంకా దారుణం. కథ పరంగా పెద్దగా కంప్లైంట్స్ లేనప్పటికీ ప్రభాస్‌ని చూపించిన విధానం, మూవీలో ఉపయోగించిన గ్రాఫిక్స్‌పై ఇప్పటికీ ట్రోల్స్ వస్తూనే ఉంటాయి. ఈ విషయంలో దర్శకుడు ఓం రౌత్‌ని ప్రభాస్ అభిమానులు ఎంతలా ట్రోల్ చేశారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సలార్, కల్కి చిత్రాలతో సక్సెస్ ట్రాక్ ఎక్కేశాడని ఫ్యాన్స్ సంతోషించేలోపు.. 'రాజాసాబ్'తో ప్రభాస్‌కి మారుతి మర్చిపోలేని ఫ్లాప్ ఇచ్చాడు. కథ డిఫరెంట్‌గా ఉన్నప్పటికీ దానికి ఇచ్చిన ట్రీట్‌మెంట్ అస్సలు వర్కౌట్ కాలేదు. మూవీలో కొన్ని సన్నివేశాల్లో ప్రభాస్ తలని వేరే బాడీకి అతికించినట్లు ఉన్న కొన్ని సీన్స్ అయితే విపరీతమైన ట్రోలింగ్‌కి కారణమయ్యాయి. ఈ సినిమాలన్నీ గమనిస్తే.. పాన్ ఇండియా చిత్రాలు తీసిన అనుభవం లేని రాధాకృష్ణ, మారుతి లాంటి దర్శకులకు అవకాశమిచ్చిన ప్రతిసారీ ప్రభాస్ దారుణమైన ఫలితాలు చూశాడు. ఇకనుంచైనా కాస్త అనుభవమున్న డైరెక్టర్స్‌తో, ఆలస్యమైనా సరే మంచి కాన్సెప్ట్ మూవీస్ చేస్తే బెటర్. ప్రభాస్ చేతిలో ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా తీస్తున్న 'స్పిరిట్', హను రాఘవపూడి తీస్తున్న 'ఫౌజీ' ఉన్నాయి. వీటిపై ప్రస్తుతానికి బజ్ అయితే బాగానే ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com